C

కవితాసమితి గ్రంథావళి - 33

# పాలకడలి

( గేయ కావ్యం )

-: రచన :-

దత్తి చిన్నికృష్ణ

894.827
CHI

♦ ప్రచురణ ♦

కవితాసమితి - విశాఖపట్నం-1

CJ

కవితాసమితి గ్రంథావళి - 33

# పాలకడలి

( గేయ కావ్యం )

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10662

-: రచన :-

దత్తి చిన్నికృష్ణ

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10662

• ప్రచురణ •

కవితాసమితి - విశాఖపట్నం-1

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకా[illegible]చే
ఎన్నుకోబడి "గ్రాంటు" పొందిన గేయకావ్యం.

ప్రథమ ముద్రణ
జనవరి 1971

894.827
CHI

వెల :
రెండురూపాయలు

ప్రతులకు :

కవితా సమితి
పురిపండా అప్పలస్వామి
23-7-11 దూళావారివీధి.
విశాఖపట్నం - 1.

ముద్రణ :
బహుజన ప్రింటర్స్
విశాఖపట్నం-1.

## కృతిసమర్పణ

అవును. ఎవరికోసం ఈ పూలు కూర్చడం
జరిగిందో ఆ సామాన్య ప్రజలకే ఈమాలికను
మనసార అంకితము చేస్తున్నాను.

## కృతజ్ఞత

ఈ పుస్తకం అచ్చు వేయడానికి ఆర్థిక
సహాయం చేసిన ఆంధ్రప్రదేశ సాహిత్య
అకాడమీ వారికి నా కృతజ్ఞత
యింతింతని ఎంతచెప్పినా ఇంకా
కొంత చెప్పవలసివుంటుంది.

దత్తి చిన్నికృష్ణ
49-32-35,
రామకృష్ణ నగర్,
విశాఖపట్నం-4

# నా తరఫున రెండు ముక్కలు

ఎవరైనా మరోసారి నన్నడిగితే యిదే చెప్తాను, అవును. సాధారణ మానవుని మీదనే నాబెంగ అంతాను. సంఘంలోని కనీసపువ్యక్తికి కనుక ఒక చంచాడు కవిత్వం ప్రసాదంలా పంచిపెట్ట గలిగితేచాలు. మహారాజుల కోటగోడలు దాటుకుని సాహిత్యం బయటపడి బీదవారి పూరి గుడిసెలను చేరగలిగిననాడే రచనలు నిత్య జీవితంలో వుపయోగ పడతాయి. లేకపోతే లక్క సామాన్ల ప్రదర్శనలోని ద్రాక్షపళ్ల గుత్తిపలె చూడ్డానికే గాని రుచి చూడ్డానికి పనికిరావు.

భాష పరమావధి ఏమిటి? ఒక వ్యక్తి తనమనసులోని భావాలను ఎదుటివారికి అర్ధమయ్యేటట్టు తెలియ జేయడం. సంజ్ఞలు చేసినా సరే - నోరువిప్పి చెప్పినా సరే ఎదుటివారికి మన భావం ఎరుకపరచగలిగితే చాలు. ఎదుటివారికి అర్ధమయ్యేటట్లు తమ భావాలను వ్యక్తం చేయవలసిన బాధ్యత చెప్పేవారిది కనుక అర్ధం కాని భాష చెవుడంటాను. అందుకోసం రాసేటప్పుడు భావాల బరువు తగ్గకుండా మాటల్ని తేలికపరచడం నిమిత్తం నేను పడ్డ వేదన ప్రసవ వేదనకి ఏమీ తీసిపోదు.

ఇక నారచనల్లోని తప్పుల్ని గురించి నాకేమీ బాధలేదు. అవి ఎప్పుడూ వుంటూనే వుంటాయి ఎదుటివారిలో.మనం రంధ్రాలు వెదికే స్వభావం కలిగివుండాలి కాని. ఇక అందలి గుణవిశేషం వల్ల ఏ ఒక్కరికైనా వుపయోగం వుంటే నాజన్మ సార్ధకం అనుకుంటాను.

మీ,

చిన్నికృష్ణ

A0UA104B101

# పరిచయం

"నవభారత కల్పకమ్మ - నాగార్జున సాగరమ్మ
కృష్ణవేణి కొప్పులోన రతనాల నాగరమ్మ"

అని మధురాతి మధురంగా పాడి ప్రేక్షకుల్ని, తోటి కవుల్ని, ఆశ్చర్యపరచిన శ్రీ డి. చిన్నికృష్ణగార్ని మొదటిసారిగా 15-8-1969న విశాఖలోని ఆకాశవాణి కేంద్రం జరిపిన రేడియో కవి సమ్మేళనలో కలుసుకోవడం తటస్థించింది. అప్పటినుండి నేటివరకు మేము సహపంక్తి కవులము, ఆత్మీయత నిండిన మిత్రులమున్నూ. ఆ తరువాత ఎన్నో కవి సమ్మేళనల్లో, సమావేశాల్లో పాల్గొన్నాము. నేడు విశాఖలో జరిగే యే కార్యక్రమంలోగాని శ్రీ చిన్నికృష్ణగారు లేకుంటే అది నిజంగా ఓ విధమైన లోటుగానే కన్పిస్తుంది. మాకే కాక ప్రేక్షకులకుకూడా. ఆయన పాటల్లో అంతటి పట్టు, గొంతుకలో అంతటి మ ధు రి మ వున్నాయి. ఎవరైనా మెచ్చుకుంటే "నేను అరరచయితను, అరగాయకుణ్ణి. వెరసి ఒక చిన్నగాయక రచయితను" అని చమత్కరిస్తారు చిన్నికృష్ణగారు. సాధారణంగా కవి అన్నవాడు కవిత వ్రాస్తాడు కాని పాడలేడు. గాయకుడు, ఎవరో వ్రాసిన పాటని చక్కగా పాడతాడు; రచన, సంగీతం యీ రెండు శిల్పాలు ఒకే వ్యక్తిలో వుండడం అరుదు. కాని మా చిన్నికృష్ణ కవి గుండెలు, గాయకుని గళం రెండూ వర ప్రసాదంగా పొందిన అసాధారణ వ్యక్తి.

కీ॥ శే॥ నండూరి సుబ్బారావుగారు వ్రాసిన "ఎంకిపాటలు" విశ్వనాథవారి "కిన్నెరసాని పాటలు" తరువాత ఎందరో కవులు చక్కటి కూర్పుల్ని ఆంధ్ర ప్రజలకందించారు. కాని ఎంకిపాటల తరువాత "పాలకడలి" గేయాలు వ్రాసిన శ్రీ చిన్నికృష్ణగారిదే అగ్ర తాంబూలం ఆయనకాయనే ప్రచార యంత్రం.

శ్రీ చిన్ని కృష్ణగారు కవి సమ్మేళనల్లో వ్రాసి పాడుతూంటే అటు కవులనుండీ, ఇటు ప్రేక్షకులనుండీ వచ్చే హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులుమారు మ్రోగుతాయి. ఆయనలేని కవి సమ్మేళన కళావిహీనంగా వుంటుంది. ఈ విషయం విశాఖలోవున్న ప్రజలకూ, కవులకూ తెలిసిన విషయమే.

"నాగార్జునసాగరం" శ్రీ చిన్నికృష్ణగారి రచనల్లో ఆణిముత్యం వంటిది. "పాలకడలిలో ముత్యాలు వున్నాయి పగడాలు వున్నాయి ఏరుకొన్నవారికి నవరత్నాలు దొరుకుతాయి. ఆస్వాదించేవారి హృదయాల్లో నవరసాలు తొణికిసలాడుతాయి. ఆయన రచనలో రసార్ద్ర హృదయం కనిపిస్తుంది. అందులో ప్రేమలోని సంయోగ వియోగాలు వేదాంతం, వైరాగ్యం, దేశభక్తి, ఉద్బోధ, హాస్యం, అభ్యుదయ సందేశాలు అన్నీ వున్నాయి. వాటి సమ్మిశ్రమమే "పాలకడలి".

"ఎక్కడుంది శాంతి" "కనువిప్పు" "అమరబాపు" "విధిబలం" "రోజులు మారాయి" "చెమటోడ్చు" "వయ్యారిభామ" "అందని స్త్రీ వలపు పులుపు" "వలచిన కోమలి" "ఆశలన్నీ మాసిపోయె" మొదలైన వెన్నో గేయాలు వివిధరసాలొలికిస్తాయి. వివిధ అనుభూతుల్ని అందిస్తాయి. రాగాలాపనతో అందర్నీ ఆకట్టుకునే గడుసుతనం చిన్నికృష్ణలోవుంది. ఆయన పాడుతూవుంటే ప్రేక్షకులు తాదాత్మ్యం చెంది ఆయన అనుభూతుల్ని పొందుతారు. ఆయన కళ కేవలం ప్రేక్షకుల్ని పగలబడి నవ్విస్తుంది. మనసుల్ని కవ్విస్తుంది. హృదయాల్ని పులకింపజేస్తుంది, కన్నీరు కార్పిస్తుంది. ఐతే హాస్యం ఒకమోతాదు ఎక్కువ. గుండెలో అగ్నిపర్వతాలుమోస్తూ, చిర్నగవుల్తో నలుగుర్నీ నవ్వించి ఆనందింపజేయగల రస స్వరూపుడు, సౌమ్య హృదయుడు. మంచితనానికి మారుపేరు, మిత్రుడు చిన్నికృష్ణ.

ఆయన జూనియర్ రేడియో ఇంజనీరు. అంటే యంత్రాల తంత్రాలు తెలిసిన ఓ ప్రభుత్వోద్యోగి అన్నమాట. ఆపనికీ కళకీ సంబంధం ఏమిటో!

శ్రీ చిన్నికృష్ణ "పాలకడలి" మధించిన రసజ్ఞులు, అమృతం తప్పక ఆస్వాదిస్తారనడం నిర్వివాదాంశం. ఆయన ఇంకా రసాత్మకమైన రచనలు చేయాలని, చేయగలరని, ఆకాంక్షిస్తూ శలవుతీసుకుంటున్నాను.

విశాఖపట్నం-4 బసవరాజు

23-12-1970

## ఇదిగో...,

ఇది పాలకడలి.

వ్యాకరణ ప్రాకారాలూ, ఛందస్సులబంధనాలూ, అలంకారాల కలంకారీలూ సంప్రదాయాల సంకెళ్ళూ ఇందులో వెదకడానికి చదికిల బడే ఛాందసులకు ఇది పాలకడలికాదు, వుప్పుకడలి. చంచాడు కవిత్వం కావాలన్న సామాన్యుడికి మాత్రం తంగేటిజున్ను.

పాలకడలి స్రష్ట దత్తి చిన్నికృష్ణగారు చక్కని గాయకుడు, పద కర్త; కవి.

కావ్యాలలో కొన్ని చదవడానికి బాగుంటాయి, కొన్ని వినడానికి బాగుంటాయి. చదవడానికి, వినడానికీ బాగుంటాయి కొన్ని.

పాలకడలి తరంగాలు-అదే-పాటలు చదవడం కంటే వినడానికి, ముఖ్యంగా చిన్నికృష్ణగారు సన్నని కిన్నెరకంఠంతో పాడుతూవుంటే వినడానికి ఎంతో బాగుంటాయి. ఆయన పాడుతూ వున్నప్పుడు సభల్లో శ్రోతలు కొసరి కొసరి పాడించుకోడం నేనెరుగుదును.

పాలకడలిలో కొన్ని సాహసిక ప్రయోగాలు కనిపిస్తాయి. ఉదాహరణకి 'చల్లనీట స్నానమాడి' 'విలసినీవిదలు' 'విలసగమనం' వంటివి. వీటిమీదికి దోషజ్ఞులు దూసుకురావచ్చు. అయితే అర్థం అనర్థం చెయ్యని ఈ 'చిన్నికృష్ణీయాలు' రచయిత అభిజ్ఞత్వంతో చేసినప్రయోగాలే అని భావించడం సౌజన్యం.

కవి చిన్నికృష్ణగారు అరమరిక ఎరగని సరళహృదయుడు. వీరి గేయాలన్నిటిలోనూ రుజువవుతుందీ విషయం. కొన్ని గేయాల్లో సరికొత్త భావాలు మెరుపుల్లా మెరిసి హృదయాన్ని అత్తుకు పోతాయి.

పాలకడలి పాటలు తెలుగునాటబహుళ ప్రచారం పొంది ఆబాలగోపాలాన్నీ ఆనందపరుస్తాయి; సందేహం లేదు.

విశాఖపట్నం-1 పురిపండా అప్పలస్వామి
25-12-'70

# పాలకడలి

పాలు నీళ్లూ కలసి నట్లే
చిన్ని కృష్ణతో నెయ్యము
కయ్యమూ ఆడొద్దు, వద్దు
వియ్యమూ దయ్యాలతో

పాలకడలిని పాత్రముంచి
కలిపి నీళ్లు వాడుకో
వేళ్ళ నిండా వెన్న వస్తే
చిన్నికృష్ణుని తలుచుకో !

# ఆకాంక్ష

ప్రకృతిమాత ఒడిలో
పాలమాటల బల్కు
పసిపాపడనైన నేను
భావిని ఊహించడం సాధ్యమేనా ?
కవిత కన్నియ కేలు
చెలిమి చేపట్టుకుని
ప్రణయ గీతికలాలపింప
జాలుదునా ?

రసిక హృదయాలపై
మృదు పదమ్ములు విసరి
విలస గమనమ్ముతో
విహరింప గలనా

విలసినీ ఎదలందు
విరహ తాపము చిందు
విఖ్యాత విభవాంత
కైతలల్లుదునా

ప్రాభాత భానుని
ప్రభవంబు విహసించు
ప్రేమ భావాలోలుకు
పాట కూర్చుదునా.

# ఎక్కడుంది శాంతి

శాంతి కోసము నేను
జగమంత వెదికాను
సుంతైన కనరాదు
ఎంత వెదకినను
ఆశ ఆధారంగా అన్నిటిని ఈదాను
ఆశ ఆధారంగా ఆకాశమెక్కాను
ఆశ ఆధారంగా నే బ్రతికి యున్నాను
ఆశ లేకను నాకు బ్రతుకుటకు సాకేది
శాంతి కోసము నేను జగమంత వెదికాను

లక్షాధికారుల కారుల్లో వెదికాను
బిచ్చగానిని ఆపి జోలి గాలించాను
దేవాలయము వెదకి దరగాను దాటి
చర్చినంతా తేరి పార జూచాను
పూజారి నడిగాను ఫాదరీనడిగాను
ఆఖరికి ఆముసలి ముల్లాను అడిగాను
ఎవరు పాడిన అదే పాత పారాయణము
ఏమిలాభము లేదు ఇక నేను వెదకి
శాంతి కోసము నేను జగమంత వెదికాను.

దార పంచదార పాయసములోజూచి
పరాంసారాయిలను మాంసాల నడిగాను
గజ్జెజంఝ్ఝుకత్తెల గజ్జె జంఝునలనడిగాను
లషములోదన్యరినడుములో పంపులను అడిగాను
చుల లేత యా డుచుల లేత యావనము నడిగాను
ను ఆవేదనధికునును ఆవేదనధికమ్ము చేసేవె
త శాంతి రుచిచుంత శాంతి రుచి చూపేవి కావు
సము సము కోసము నేను జగమంత వెదికాను

కోయిలను కొంత సేపాపి పాడించాను
హంసచే కాసేపు ఆటలాడించాను
నెమలి పుంజును పిలచి నాట్యమాడించాను
హరిణి క్రీగన్నుల సోయగము చూచాను
అదియేల యిదియేల అన్నిటిని వెదకి
తెలుసుకొంటిని యింక తెలియలేననుచు
శాంతి కోసము నేను జగమంత వెదికాను.

శాంతి కోసము నీవు
జగము వెదకగనేల
నీ యింటనే కనుము
నీవు శాంతమ్ము

నాల్గు గోడలమధ్య
నాకమును నిర్మించి
ఉన్నదానితో తృప్తిపడి
మెలగుచుండియు
కష్టసుఖములలోన
సమభావమును చూపు
స్థితప్రజ్ఞునింట
జనియించు శాంతమ్ము
శాంతి కోసము నీవు జగము వెదకగనేల
నీ యింటనే కనుము నీవు శాంతమ్ము.

# రుద్రమాంబ

రుద్ర మాంబా నీవు
రుద్ర భూమిని చేరినావా !
కోటిరుద్రుల రౌద్ర
కాలివై వెలిశావు
కటికనేలను నిదుర
పోవుచున్నావా ?
రుద్రమాంబా నీవు
రుద్రభూమిని చేరినావా!

పట్టు పరుపుల పైన
పవ్వళించే నీకు
వట్టినేలను నిదుర
ఎటుల పట్టును తల్లీ
రుద్రమాంబా నీవు
రుద్రభూమిని చేరినావా

మీసాలు వడివేయు
మగవారి కంఠెను
రోసాన తీసిపోవమ్మా
ప్రాణాలు బాసినా
పరమజ్యోతిగ నీవు
మాలోన వెలసినావమ్మా!
రుద్రమాంబా నీవు
రుద్రభూమిని చేరినావా !

పుట్టబోయెడు వైరి
పుత్రులకు గుండెలో
బండపడు నీ పేరువిన్న
వట్టిమాటల వేల
పరవీరులందరికి
పగులు గుండెలు సివనన్న
రుద్రమాంబా నీవు
రుద్రభూమిని చేరినావా !

# దేహము జాగరత

ధర్మసాధన సాధ్యమునీకు
దేహము బాగుగవున్నపుడే
మనసా దేహము జాగరత
దేహము ఒక దేవాలయము
అందు వసించే జీవుడే
సనాతనుడో ఆ దేవుడు
మనసా దేహము జాగరత

రుచి కలదని అతిగా భుజియింపకు
మితినిమీరి భోగాలను కోరకు
తనువు కృశించి నశించిన వేళ
హంస వసించుట సంశయము
మనసా దేహము జాగరత

పాడుపడిన దేవాలయమున
దేవుడు నిలువడు ఒక్కదినం
వాసయోగ్యము కాని దేహమున
జీవుడు నిలువడు ఒక్కక్షణం
మనసా దేహము జాగరత

# భావి పౌరులం

బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం
బడిపంతులు మాపాలిటి
దేవుడనుకుంటాం

తెల్లవారకుండానే
నిదుర మేలుకుంటాం
చల్లనీట స్నానమాడి
తలలు దువ్వుకుంటాం

॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

అల్లరిచేసే పిల్లల
దరికి చేరబోము
కల్లమాటలాడువారి
చెంత జేరనీయం
॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

గుడిలోను ఒక గంట
బడిలో ఒక గంట
కడుపు మంట వేసెనంటె
కొట్టెను ఒక గంట
॥బడికి పోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

ఈనాటి పిల్లలం
రేపటి పౌరులము
నానాటికి వృద్ధిచెంది
ఔదుము వీరులము
॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

మాలోనూ వున్నారు
వీర శివాజీలు
మాలోనూ వున్నారు
బాపూ, నెహ్రూలు
॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

శరీరాలు చిన్నవని
చులకన చేశారుకాని
శాసించే పెద్దలంతా
మొదట పసివారేగా

॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

చావంటే భయంలేదు
కష్టమంటె వెనుకాడం
శత్రువుల్ని ఓడించే
చేవ మాకు బోలెడుంది

॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

తాగుబోతులంటె మాకు
బాగ ఏవగింపు
భోగలాలసుల వల్లనె
తీరని తలవంపు

॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

జాతిమత ద్వేషాలు
మొగ్గగానె తుంపుతాం
దేశ ద్రోహులందర్నీ
నరకానికి పంపుతాం

॥బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం॥

గిల్లి కజ్జాలాడువారి
మాలో వెలివేస్తాం
బడి దొంగలు అయినవారి
తో ముడి విడిపోతాం

బడికిపోవు పిల్లలం
బాగ చదువుకుంటాం
బడిపంతులు మాపాలిటి
దేవుడనుకుంటాం !

# నాగార్జున సాగరం

నవభారత కల్పకమ్మ
నాగార్జున సాగరమ్మ
కృష్ణవేణి కొప్పులోన
రతనాల నాగరమ్మ
రమ్మ రమ్మ తరలి రమ్మ
నాగార్జున సాగరమ్మా

పెన్న కృష్ణ గోదావరి
పుణ్యనదులు ఏకమ్మై
బ్రతుకలేని బీదప్రజల
బ్రతుకులు నిలబెట్టవమ్మా ॥తరలిరమ్మ॥

బీడుపడిన పొలాలన్ని
తిరిగి మడులుగా మారగ
బంగరు పంటల బంజరు
లన్ని పక్కుమని నవ్వగ ॥తరలిరమ్మ॥

పుణ్యము సంపాదింపగ
దానము చేదామంటే
మచ్చుకైన బిచ్చగాడు
కానరాని రోజుతెమ్మా ॥తరలిరమ్మా॥

మోడుపడిన జీవితాన
ఆశలు చిగురించునట్లు
పేదవాని ప్రాంగణాన
పెన్నిధి మొలిపింపవమ్మా ॥తరలిరమ్మా॥

జలజలమని నీనడకల
కలకల వినిపించగానె
సిరులరాణి చేగాజుల
గలగల అనిపించెనమ్మా ॥తరలిరమ్మా॥

మూడేళ్లకు ఒకసారి
పండే అరపంటలతో
ఎంత కష్టపడినగాని
ఆరని ఆకలిమంటలు
ఏడాదికి మూడుకార్లు
పంటలు పండేటట్లు
లేనివాని ముఖముమీది
ముడుతలు పూడేటట్లు
తరలిరమ్మా తరలిరమ్మా
నాగార్జున సాగరమా

# ముందుచూపు చూడు

చూడు ముందుకు చూడు
ముందుచూపు చూడు
ఉన్నదంతా ముందే
గతాన ఏముంది ॥చూడు ముందుకు చూడు॥

ఇచ్చేవాడెప్పటికీ
తగ్గించమంటాడు
పుచ్చుకునేవాడు
కొంత హెచ్చిన మేలంటాడు
హెచ్చింపులు తగ్గింపులు
పీకులాట బేరాలు
మధ్యమార్గమే చక్కటి
న్యాయమైన మార్గముగా ॥చూడు ముందుకు చూడు॥

ప్రగతీవుంది నీముందు
నడుముకట్టి నిలుముందు
నిరుద్యోగమంతు అంతా
సోమరితన మిమిడియుంది
ఒళ్లువంచువానికెపుడు
చేతినిండ పనివుంది
పనిపాటలు లేనివారి
ఆకలికదియే మందు ॥చూడుముందుకుచూడు॥

ఐకమత్యమున్న ఎడల
అన్నీ సాధించవచ్చు
గడ్డిపోచలల్లి పెద్ద
గజాన్ని బంధించవచ్చు
పరిశ్రమలలో తగిన
భాగస్వామ్యము కలిగి
పంటపొలములో తగిన
భాగస్వామ్యము కలిగి
కూలీ యజమానయ్యే
రోజు తిరిగి వస్తుంది
రైతూ కామందయ్యే
రోజు తిరిగివస్తుంది

చూడుముందుకు చూడు
ముందుచూపుచూడు
ఉన్నదంతా ముందే
గతాన ఏముందీ

# యదార్థవాది పిచ్చివాడా?

నేపిచ్చివాణ్ణంటే నమ్ముతారా?
బిచ్చమేస్తే పుచ్చుకోను
బచ్చలితిని బతుకుతాను
గచ్చులపై నిదురిస్తా

వెచ్చవెచ్చని మాట్లాడుతా
లుచ్చాకోరువాళ్లందర్నీ
పచ్చిబూతులు తిడతా
కచ్చపట్టుకు కొడతా

మీ రచ్చలతో పనిలేని
విచ్చలవిడి బతుకునాది
మచ్చలేని మనసునాది

పచ్చని బంగారాలు
నాకు ముచ్చిబంగారాలు
లచ్చల ముచ్చట్లు
నాకు గచ్చల గిలిగిచ్చలు

పెచ్చుపెరిగిన మచ్చరాలకి
మచ్చులేని గతి వచ్చేదాకా
పచ్చని జీవితాలు ప్రజలందరికీ
వచ్చేటంతటిదాకా
పిచ్చివాడిగ నేను చెడి తిరుగుతాను,

# బొంబాయిలో

నా మంచంనిండా నల్లులే
నా కంచం చుట్టూ పిల్లులే
మా వీధి నిండా పిల్లలే
నా గుండె గోడకు బల్లులే
నా మాటలలో పొల్లులే
ఈ వూరినిండా మిల్లులే
శాంతివిత్తులు చల్లలే
ఇట భ్రాంతివత్తులు కొల్లలే
పాతకాలకి ఎల్లలే
ఇట నీతిబాలకి తల్లిలే
ఇట వేగడానికి ఇల్లులే
ఇట తాగడానికి కల్లులే
ఇట కాటకాలకి చెల్లులే
ఇట మాటిమాటికి బిల్లులే
నా పాతనిండా చిల్లులే
నా మేతనిండా కల్లులే

# వీర సిపాయి

సిపాయీ మంచుకొండలపై
మా కోసం పోరుతున్నావా
పరులకు లొంగి మెలగుటపై
మరణమే మేలనన్నావా

కాయమును గాయపరచేటి
మంచులో మసలుతున్నావా
శత్రువుల ఎదను నిదురించి
దీక్షయే హారమన్నావా
బారులుగ పారు శత్రువుల
గుళ్లకే గుండెనిచ్చావా
॥సిపాయీ మంచుకొండలపై॥

నీ కోసం ఆయుధాలెన్నో
కొనుటకై ఆడవారంతా
ఒంటిపై వున్న వస్తువులు
ప్రీతితో ఒలిచి యిచ్చారు
పసుపుకొమ్ములను మెడనుంచి
పుస్తులే తీసియిచ్చారు
॥సిపాయీ మంచుకొండలపై॥

సైన్యమున వున్న సిపాయీ
ఇంటిపై దిగులు నీకేల
ఇచటనే భార్యబిడ్డలను
భద్రముగ కనిపెడుతున్నాము
నీకోసం భూములనుకూడ
సిద్ధముగ చేసియుంచాము
॥సిపాయీ మంచుకొండలపై॥

ఒక్కపరి జన్మమెత్తినచో
ఎప్పటికినైన చావుంది
గెల్చితే రాజ్యమేలెదవు
చస్తివా స్వర్గమేగెదవు
తల్లిఋణమిపుడె తీర్చగను
తరుణమే తెంచినాదయ్యా
॥సిపాయీ మంచుకొండలపై॥

# కను విప్పు

నీ కూపమును వీడి
వెలికి ఒకసారి రా
జగమెంత పెద్దదో
కనువిప్పి చూడరా
ఉన్నదన్నానని
ఉలికి పడబోకురా

॥నీకూపమునువీడి
వెలికి ఒకసారిరా॥

ఊరి వెలుపల చిన్ని
పూరి గుడిసెలలోన
ఉన్న దానితో తృప్తి
పడి మెలగువారు
పురి కోసల మంచాన
కూర్చుండబెట్టినీ
అరచేతి కంచాన
అంబలిని చవిచూపు
దంపతుల మనసులో
లోతెంతో చూడరా

॥నీకూపమునువీడి
వెలికి ఒకసారిరా॥

పగలు రేయనకుండా
మగవారితో కలసి
కష్టపడి పనిచేయు
పడుచులను చూడరా
చంకనుండి జారు
బిడ్డనెగవేసుకుని
గూడపట్టెడు బొట్టి
పట్టుదల చూడరా

||నీ కూపమునువీడి
వెలికి ఒకసారి రా||

ఇల్లు వాకిలి లేక
పనిలేని యీతడు
బతుకు గుదిబండగా
బరువీడ్చగా లేక
కన్నీళ్లతో కడుపు
నింపుకొను చుండురా
కటిక నేలను బాట
పక్క నిదురించురా

॥నీ కూపమునువీడి
వెలికి ఒకసారిరా॥

వీధిలో విసరిన
పుల్లాకు కోసమై
కుక్కతో పోట్లాడు
బీదవాడెవడురా
బొడ్డు తడియారని
బిడ్డ వీపున గట్టి
బాబు ఒకపైస అను
బిచ్చకత్తెవరురా

॥నీకూపమును వీడి
వెలికి ఒకసారిరా॥

## నువ్వా నేనా

నువ్వా నేనా
ప్రజల కోసమై
ప్రాణం సైతం
త్యాగం చేయగ
సంసిద్ధపడింది
నువ్వా నేనా.

మాటి మాటికీ
　　కాటకాలతో
రాటుదేరిన
　　మోటుబారిన
కార్మిక కర్షక
　　సంఘటనల్లో
భోగంలో నొక
　　భాగమిచ్చింది
నువ్వా నేనా

నిరంకుశత్వం
　　నిర్మూలించే
పరాధీనతను
　　పరిత్యజించే
ప్రజా ప్రభుత్వం
　　నిజస్థలించే
పంథా లెన్నో
　　ప్రజకు చూపింది
నువ్వా నేనా.

ఎండనకుండా
        వానకుండా

బండచాకిరికి
        కండబలిచ్చే

నిండు అభాగ్యుల
        కండ నిచ్చింది

రెండు పూటలా
        తిండి కూర్చింది
నువ్వా నేనా.

కమ్మని మాటల
        నమ్మకాలతో

అమ్మవారు మిము
        రమ్మంటుందని

కమ్మటి బలులను
        యిమ్మంటుందని

సొమ్ముల నెన్నో
        తెమ్మంటుందను

తిమ్మరా రాజుల
        రిమ్మ తెగుళ్లా

మరమ్మతు చేసింది
        నువ్వా నేనా.

ప్రజల హక్కులను
పరిరక్షించే

ప్రజా ప్రభుత్వం
రావాలంటూ

ప్రజా భావముల
పరిచిత్రించే

ప్రజా కవిత్వం
కావాలంటూ

నిమ్న జీవులకు
నీడ నీయని

నిరంకుశత్వం
పోవాలంటూ

నినాదాలతో
నిద్రాగతులను

మేల్కొల్పుతూ
ముందుకు సాగింది

నువ్వా నేనా.

# అమర బాపూజీ

మన గాంధి మనలను
విడచి పోయాడని
విన్నవారికి కన్ను
చెమ్మగిలిపోయె
నమ్మడానికి మనసు
సమ్మతిలదాయె

||మన గాంధి మనలను||

ధరణి గుండెలు పగిలి
దద్దరిలి పోయింది
సూర్య చంద్రుల కంట
కన్నీరు కారె

||మన గాంధి మనలను||

భువినెపుడు ధర్మంబు
పల్చబడు చుండునో
నెలకొల్ప ధర్మమును
హరి యవతరించును
దుష్ట మనముల మార్చి
శిష్ట రక్షణ చేయ
శాంతి దాతగ
అవతరించె బాపూజీ ||మన గాంధి మనలను||

జగమంత నాదెయని
బావుకొను మన బాపు
తనవాడు పోయెనని
జగమంత వాపోయె ||మన గాంధి మనలను||

అణుశక్తి యుగమందు
ప్రళయ భయమెంతయు
జగతిపై దండెత్తి
పలుమారు బెదిరింప
మారుమూలల శాంతి
సందేశమును చాటు
శాంత్యహింసలు రెండు
పావురాల్ పంపించి ||మన గాంధి మనలను||

వట్టి మాటలలోన
గట్టి ధాన్యము లేదు
చేతలో తేనిదే
చేతికెప్పుడూ రాదు
సాకులెన్నో చెప్పి
తప్పించుకోలేవు
పనిచేసి చూపితే
పనివాడవౌతావు ||మన గాంధి మనలను||

ముసలివారలమధ్య
శతవృద్ధుడౌతాడు
బాలబాలికలతో
పసిపాపడౌతాడు
పెనుగులాటను
ఏనుగునులొంగదీస్తాడు
ప్రేమతో చీమకు
లొంగిపోతాడు ॥మన గాంధి మనలను॥

ఆకసముగొల్లుమనె
ధృవతార రాలెనని
జగమంతచింతిల్లె
జ్యోతిఆరిందని
భారతావని గుండె
బాదుకొనివిలపించె
ప్రాణవాయువుగుండె
వీడిపోయిందని

॥మన గాంధి మనలను విడచిపోయాడని
విన్నవారికి కన్ను చెమ్మగిలిపోయె
నమ్మడానికి మనసు సమ్మతిలదాయె॥

# బాలల నెహ్రూ

బాలల నెహ్రూ మనకు లేడు-అయ్యో
బాలమిత్రుడస్తమించినాడు
నేటి బాలలే రేపటి
నేతలనే నినాదం
బాలలలో భగవంతుడు
వెలయుననే వాదం
రెండింటిని సమర్థించు
ఆశాజ్యోతి యింక లేడు-అయ్యో
బాలమిత్రు డస్తమించినాడు
||బాలల నెహ్రూ మనకు లేడు-అయ్యో
బాలమిత్రు డస్తమించినాడు||

చాచా మాటంటే మన
నాయకులకు తలపుష్పం
స్వార్థపరుల పాటంటే
చాచాకు తెగకోపం
బాలల మాటెప్పటికీ
కిందపడిన సహింపడు
బాలల గౌరవము భూమి
నలుచెరగుల చాటినాడు
||బాలల నెహ్రూ మనకు లేడు-అయ్యో
బాలమిత్రు డస్తమించినాడు||

హెచ్చు తగ్గులు మచ్చుకు
ఎరుగడు మన చాచా
అంటురోగమే ఎరుగని
ఆత్మయోగి మన చాచా
"ఆరాం" కోరుకొనుట పట్టి
"హరాం" అనే చాచా
అన్ని హంగులూ కల్గిన
ఆటబొమ్మ మనచాచా
॥బాలల నెహ్రూ మనకు లేడు- అయ్యో
బాలమిత్రుడ స్తమించినాడు॥

చాచా చెప్పిన మాటలు
తూచా తప్పము మనము
నడుము పంచువాని గడప
వేచియుండు సిరి ఎపుడూ
వంచన తలపెట్టు వాని
కంచము ఖాళీ ఎపుడూ
మనప్రగతిని కని చాచా
ఆత్మశాంతి నొందునెపుడు
॥బాలలనెహ్రూ మనకు లేడు-అయ్యో
బాలమిత్రుడ స్తమించినాడు॥

# పొరుగింటి చైనావాడు

లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా
పొరుగింటి చైనావాడు పాపభీతి లేనివాడు
పొరుగంటే కిట్టనివాడు పొట్లపాదు జాతివాడు
మనపచ్చతనాన్ని చూచి కన్నుపొడుచుకున్నాడన్నా
॥లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా॥

పంటలు తక్కువ తినువారెక్కువ
ఊపిరి సలుపక పెరిగే ప్రజలు
వెన్నులు విరిగే ధరల భారము
మిన్నును అంటే ఆకలి మంటలు
కన్నె తెంచి మన చేలో పడెరా
నీతి లేని చైనా దున్న
॥లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా॥

నిలబడితే కలబడతాడు
కలబడితే పరిగెడతాడు
ముఖం మీద భాయంటాడు
వెన్ను పొడిచి హాయంటాడు
తిరుగు దెబ్బ తిన్నాడంటే
వెనుక తిరిగి చూడడన్నా
॥లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా॥

లోకపు పోకడ కెదురు తిరుగును
హితవంటే పెడచెవిని బెట్టును
ఊకతినును తెగ ఓండ్రపెట్టును
బురదంటే పన్నీరుగ నెంచును
తిన్నయింటి వాసాలెన్నో
తీరుగ లెక్కించునురన్నా
॥లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా॥

విశ్వ శాంతి కాంక్షించే
విధానాలు మనవి
పదిమందిని సమకూర్చే
పంచశీల మనది
మనవిధాన మంటేను
భళిభళి యనిరందరు
ఆమందు మంచిదే కాని
చేదందురు కొందరు
పోగాలము దాపురించెను
కనడు వినడు మూర్ఖునడన్నా
॥లాలన్నా లాలన్నా లాలచిన్ని బాలన్నా॥

# నా మాట విను

వెనుకటి వాసన వదలిపెట్టి నా
వెంట నడువరా తమ్ముడా
పరిసరాలు నీ మనస్తత్వమును
బాగుచేయురా తమ్ముడా అవి
మెరుగుపరచురా తమ్ముడా ॥ వెనుకటివాసన॥

మంచి మాటలను పెడచెవి బెట్టుట
మంచిదికాదురా తమ్ముడా
ఇంచుకంత నీ ఇంగితజ్ఞానము
వాడుట మంచిది తమ్ముడా-అది
ఒంటికి మంచిది తమ్ముడా ॥ వెనుకటి వాసన॥

చెప్పుడు మాటలు విన్నావంటే
చెడిపోతావురా తమ్ముడా
తప్పుడుదారులు తొక్కితివంటే
చెప్పుదెబ్బలే తమ్ముడా మరి
తప్పవు దెబ్బలు తమ్ముడా ॥ వెనుకటి వాసన॥

పప్పుకూడు తినబోకు ఎప్పుడూ
అప్పులపాలై తమ్ముడా
అప్పుల భారము అధికమ్మైతే
ముప్పుతప్పదుర తమ్ముడా నీ
పప్పులుడకవుర తమ్ముడా నీ
కుప్పుపుట్టదుర తమ్ముడా ॥ వెనుకటివాసన॥

## విధి బలము

నడిసముద్రపు నావ
తూఫాను దాటుకుని
విధి బలము చాలక
ఒడ్డునే మునిగింది
విధిని దూషించుచు
వ్రేర వీగుట కంటే
తలవంచుకుని పోవ
తలవంపు కాదు

॥విధివ్రాత నెవ్వరు చదువగా నేర్చారు
విధిగతిని మరలించు మరలెవరు కూర్చారు॥

సాగు చేసిన చేను
బాగ పండకపోతె
అందులో వింతైన
కబురేమిటుంది
దానిపై నీపేరు
వ్రాసి యుండకపోతె
చేతిలోనిదె గ్రద్ద
తన్ని పోతుంది

॥విధివ్రాత నెవ్వరు చదువుగానేర్చారు
విధిగతిని మరలించు మరలెవరు కూర్చారు॥

పరువంపు నీచెలి
పెదవి విరుచుకు నిన్ను
విడచి పోయిందంటె
వింతేమి టుంది
చెడ్డరోజులు వచ్చి
విధివెక్కిరించితే
నీడ కూడా నిన్ను
వీడిపోతుంది
॥విధివ్రాత నెవ్వరు చదువుగా నేర్చారు
విధి గతిని మరలించు మరలెవరు కూర్చారు॥

కలిమి పుత్రులు భార్య
కలసి రారంటేను
యిందులో వింతైన
ఊసేమిటుంది
యమభటులు గడపలో
నిలుచున్న వేళలో
నీప్రాణమే నిన్ను
వీడిపోతుంది
॥విధివ్రాత నెవ్వరు చదువగా నేర్చారు
విధి గతిని మరలించు మరలెవరు కూర్చారు॥

# రోజులు మారాయి

మారాయిరా మామా-రోజులు
మారాయిరా మామా
పాత పద్ధతులు పక్కన బెట్టి
ప్రగతిపథంలో ప్రజానీకము
పనిచేస్తుంటే కూడూగుడ్డకు
కరువులేదు మామా- రోజులు
మారాయిరా మామా
||మారాయిరా మామా రోజులు
మారాయిరా మామా||

మారాయిలే భామా-రోజులు
మారాయిలే భామా
పంటపొలంలో పరిశ్రమల్లో
నా బొందియని పనిచేస్తారు
ఎంతచేసినా ఫలితం మాత్రం
గొర్రెతోకలా బెత్తెడె కాదా
అమాయకులనూ అసహాయులను
దోచుకొనుటలో రీతులు కొత్తవి
వచ్చాయిలే పిల్లా రోజులు
మారాయిలే భామా
||మారాయిలే భామా-రోజులు
మారాయిలే భామా||

మారాయిరా మామా - రోజులు
మారాయిరా మామా
ప్రజాస్వామ్యమున ప్రజలందరును
ఎవరి బాధ్యతలు వారు తెలుసుకొన
అర్హతలన్నీ వాటంతటవి
సంక్రమించులే సర్వజనాళికి
ఒకరికి ఒకరు చేయి చేయిగా
కలిసి మెలసి కష్టించిన రోజున
కరువు లేదు మామా - రోజులు
మారాయిరా మామా

॥మారాయిరా మామా రోజులు
మారాయిరా మామా॥

మారాయిలే భామా రోజులు
మారాయిలే భామా
పేదప్రజలు కష్టించినదంతా
పెద్దప్రభువుల జేబులు నిండగ
కరువు బాధ పడు బీదల చూచి
"ఉపవాసము మీ ఒంటికి మంచిది
పుణ్యామొచ్చు శనివారమనుకొనిన"
అంటూ నీతులు ఏకరువెట్టే
బందిపోటు మహరాజులందరికి
కరువు ఎక్కడుండే పిల్లా
కరువు లేదు లేవే

॥మారాయిలే భామా - రోజులు
మారాయిలే భామా॥

సర్వసమానత్వం
మన రాజ్యాంగపు సూత్రం
ప్రగతికి మంత్రం
హెచ్చు తగ్గులు
మచ్చుకు లేక
మనది కాదనే
భావం పోయి
అంటరానితన
మావల పెట్టి
నిరక్షరాస్యత
నిర్మూలించి
ఇంటి దొంగలు
పెద్దమనుషులయి
కంచెలు యిటుపై
చేను కాయవలె
కంచెలు యిటుపై
చేను మేయవు
ప్రణాళికలకై
వెచ్చించిన
కోటాను కోట్ల
రూపాయిలు
ఏ నలుగురు
కోటీశ్వరులనో హరించక

ప్రణాళికలు

సాధించిన ఫలితం

సవ్యముగా

సామాన్యుని కంది

బక్కచిక్కిన

వానికికూడ

చక్కటి ఉపాయాలను గూర్చి

గాంధీజీ ఆశించినట్టి ఆ

రామరాజ్యమే

నిజస్థలించగ

పరిమితమైన

కుటుంబాలతో

అపరిమితానందంబును పొంది

ఎవరి బాధ్యతలు

వారు తెలుసుకొని

ఎవరి విలువ

వారెరిగిననాడు

స్వర్గమెక్కడుండే పిల్లా

ఇలయె స్వర్గమానే

స్వర్గమెక్కడుందోరి మామా

ఇలయె స్వర్గమారా

ఇలయె స్వర్గమారా

భారత భూమి స్వర్గమేరా

# చీడపురుగులవిూద మందుజల్లు

పాతరలు వేసి తడి
సూతరమ్ములతో
కష్టజీవుల లేత
కుత్తుకలను కోయు
పోత రా రాజుల
కాతర సేయకు
మెంత మాతరము... ... ...

పాత కాలను బాప
జాతరలు చేసే
చేత కానివారి
రోత సేయుము
చేతనైనంత వరకు... ... ...

లేత ప్రాయానసే
దూత పెట్టుమువారి
భూత పిపాసలను
కోతపెట్టుము వాటి
పాతాల వేళ్లపై
వాతపెట్టుము వారి
పాత అలవాట్లపై
పేద జీవుల ఇక్కట్లు
సాంతము తొలగునట్లు... ... ...

# కబీరు మాట వినుము నా నోట

భక్త కబీరు మాటలు వింటే
భయమే లేదన్నా
చీకటిలో అల్లాడే వారికి
వెలుగు బాటరన్నా ॥భక్త కబీరు॥

పగలు గడిపితివి తిండిపై బడి
నిదురావస్థను రాత్రి దొర్లినది
లక్షల విలువ చేసే బతుకును
గవ్వలవలె వెచ్చించకురన్నా ॥భక్త కబీరు॥

బండకు మొక్కిన దైవము దొరకిన
కొండను కొలచెద రెండుపూటలా
లేకుంటే ఆ రాతి కంటె మన
పిండి విసరు చట్రాయి మేలురా ॥భక్త కబీరు॥

నీగుడిసెను కొనిపోయి కసాయి
పొరుగున వేయుమురా
పాపము తగిలిన కోసేవాడికి
మదిలో నీకు దిగులెందుకురా ॥భక్త కబీరు॥

ఏకొయ్యకు నిప్పంటే అదియే
సొంతం తగులడుతుంది
ఇతరములకు ఏమౌతుంది
పాపము లేనిచో భయమెందుకురా ॥భక్త కబీరు॥

## నా రాజు

యుద్ధాని కెళ్లినాడే-నా రాజు
యుద్ధాని కేగినాడే ॥యుద్ధాని కెళ్లినాడే॥

యుద్ధభూమిలో నిద్రా హారాలు మానుకుని
కష్టపడుతున్నాడే-నా రాజు ॥యుద్ధాని కెళ్లినాడే॥

ఇంటికాడ పూరకుండి
రెండుపూటలా కడుపుకు
తిండి కూరుకుంటూ
కూరుచున్న వారినెల్ల జూచి
పక్కుమని నవ్వాడే -నారాజు
॥యుద్ధాని కెళ్లినాడే॥

కన్నగడ్డ కాపాడుట
కన్న మిన్న పనిలేదని
అడ్డులెన్ని ఎదురుపడ్డ
అవలీలగ దాటుకొంటూ
ఎంత కాలమునకైనా
విజయము మనదేనంటూ
నొక్కి చెప్పుతున్నాడే-నా రాజు ॥యుద్ధానికెళ్ళినాడే॥
సరిహద్దులు చుట్టుముట్టి
పొరుగుమూక మూగినారు
ఇదిమాది అదిమాదని
దురాక్రమణ చేసినారు
తాడో పేడో తేల్చుకు
మరీ తిరిగి వస్తానని
నడుముకట్టి నిలచాడే-నా రాజు ॥యుద్ధానికెళ్ళినాడే॥
మాతృదేశ రక్షణలో
మరణమైన మేలేనని
చచ్చినచో ఆస్వర్గం
గెల్చిన యిల స్వర్గమంచు
ఎలుగెత్తి చాటినాడే-నా రాజు ॥యుద్ధానికెళ్ళినాడే॥
పుట్టినప్పుడంతా
ఒకరీతిగనే పుడతారు
చచ్చుటలో వేరువేరు
తరగతులుంటాయంటూ
ఎప్పటికైనా చావు
తప్పదంటు తానుచావ
సిద్ధపడి వెళ్ళాడే-నా రాజు ॥యుద్ధానికెళ్ళినాడే॥

నాకోసము మీరక్కడ
బెంగ పెట్టుకోవద్దని
ఇబ్బందులు లేకుండా
డబ్బు పంపుతుంటానని
రేపటి పౌరులు పిల్లల
బాగ పెంచుకోవాలని
మరీ మరీ రాసినాడే-నా రాజు ॥యుద్ధానికెళ్లినాడే॥

# దేశానికి గట్టి పునాదులు

నీసౌధమెంత సుందరమో-మాబాబు
మము మరచిపోబోకయ్యా
మా బతుకు బండలుగ
చేసి నీ యింటికి
పునాదులుగ వేసినామయ్యా

॥మము మరచిపోబోకయ్యా॥

మా మేని కండలు
చక్కగా చెక్కి యీ
స్తంభాలుగా నిలచినాము
॥మము మరచిపోబోకయ్యా॥

చెమటోడ్చి వడపోసి
వెల్లలో కలిపి నీ
గోడలకు పూసినామయ్యా
॥మము మరచిపోబోకయ్యా॥

మాసతుల మెడలోని
పసుపు కొమ్ములు దంచి
గుమ్మాల కలదినామయ్యా
॥మము మరచిపోబోకయ్యా॥

మా యింట పసిపాప
పాలకై ఏడ్చుచు
ఏడ్వలేకను యింక
నిదురపోయాడులే
బాబుగారబ్బాయి
స్నానానికై యివిగో
తెచ్చినాము గుమ్మపాలు
॥మము మరచిపోబోకయ్యా॥

# చెమటోడ్చు

చేసిన శ్రమ ఎపుడూ వూరకె పోదు
శ్రమ చేయక సిరి చేరువ రాదు
||చేసిన శ్రమ ఎపుడూ వూరకెపోదు||

కడిగిన మొగమున్న
అడిగిన మగువున్న
ఏరిన బియ్యమూ
దున్నిన మడివున్న
ఆదిలోనే సగము
శ్రమ తీరుకావున
అదును కుదిరినాక
పని సగము తేలిక
||చేసిన శ్రమ ఎపుడూవూరకెపోదు||

ఎంత బలగమున్న
ఎంతగ బలమున్న
కలుగదు ఫలితము
చెమటోడ్చక యున్న
సోమరిగా జీవితము
గడపవలెనన్న
కూర్చుని తింటే
కొండలు తరగ తేలిక
||చేసిన శ్రమ ఎపుడూవూరకెపోదు||

చేతనై నంతగ
శ్రమ చేసి చూపు
చేతకాదని ఎపుడూ
చూపకు వీపు
వీగిపోయితివన్న
వెన్ను చూపితివన్న
కుక్క బతుకు కన్న
నీ బతుకె తేలిక
||చేసిన శ్రమ ఎపుడూ వూరకె పోదు||

కష్టమొకరిపాలు
కష్టఫలిత మొకరి పాలు
అన్న మొకరి పాలు
అన్న సారమొకరి పాలు
ఎవడు నేర్పినదయ్యా
ఈ వింత న్యాయం
సాగనీయకు మింక
సాంఘిక అన్యాయం
అరికట్ట వలెనింక
ఆర్థిక వ్యత్యాసం
ఎంత కాలంబైన
ఎంత కష్టమ్మైన
ఆ రోజు రావాలి
అది నాకోరిక
||చేసిన శ్రమ ఎవ్వుడూ వూరకె పోదు||

# ఇద్దరులేదా-ముగ్గురు చాలు

ఎందుకోయీ యింత
బాదర బందీ
ఏలానోయీ నీకు
పిల్ల లింత మంది
॥ఎందుకోయీ యింత బాదర బందీ॥

ఒంటరిగా వున్నావంటే
చీకూ చింతా లేదు
జంట కట్టి నావనుకో
మెడలో గుదిబండ అనుకో
తీరును ముద్దూ ముచ్చట
ఇద్దరు ముగ్గురను కంటే
మోయలేని బరువేయాను
ఎక్కువై తే అంతకంటే
లాగలేవు యీ బండి
ఒంటి రెక్కపైన నువ్వు
ఒంటెద్దు బండికైనా
ఓవరు లోడవుతుంది
॥ఎందుకోయీ యింత బాదర బందీ॥

ఆరు నెలల పురటాలు
మూడు నెలల చూలాలు
ఎంత నీకు పెళ్లామైనా
పిల్లలకను యంత్రమేనా
॥ఎందుకోయీ యింత బాదర బందీ॥

డజను లెక్క సలీసు అంటూ
అరడజను పిల్లల కంటే
పోషించడ మెంత కష్టమో
వూహించడ మంత కష్టము
మేలుకోరి చెప్పానంటే
ఆపైన నీ యిష్టము
॥ఎందుకోయీ యింత బాదర బందీ॥

పరిమితమౌ ఆదాయంతో
మితంలేని సంతానంతో
కడుపు నిండ తిండి పెడితే
ఒంటి నిండ బట్ట లేదు
రోగమొస్తే ఏమి చేస్తావ్
మందులేమి పెట్టి తెస్తావ్
చదువుల మాటేమి చేస్తావ్
ఉద్యోగా లెక్కడ తెస్తావ్
॥ఎందుకోయీ యింత బాదర బందీ॥

ప్రణాళికల ఫలితంవల్ల
పరిశ్రమలు స్థాపించాము
ప్రగతి ఎంతో సాధించాము
ఆహారోత్పత్తిని కూడా
ఇతోధికంగా పెంచాము
ఆర్థిక స్తోమత పెంచాము
ఉద్యోగాలను పెంచాము
ఉత్పత్తుల పద్దు పెరిగినా
జనాభాలు హద్దులు మీరె
అవకాశా లెంత హెచ్చినా
అవసరాలు వాటిని మించె
ఎందుకోయీ యింత
బాదర బందీ
ఏలనోయీ నీకు
పిల్ల లింత మంది.

# చిక్కనైన సంసారం

చిక్కనైన సంసారం
చక్కటి మణిహారం
ఎక్కువైన పిల్లలభారం
చిల్లముల్ల హారం
పల్లేరు ముల్ల హారం
॥చిక్కనైన సంసారం॥

ఇద్దరు ముగ్గురు పిల్లలతో
చేరును నీ నావ అద్దరి
ఎక్కించకు లెక్కకు మించి
చెక్క పూటు అవుతుంది
తేలికైన సంసారం
నడక చాల తేలిక
బరువైన కుటుంబపోకడ
రోడ్డు రోలరు పోలిక
మంచికోరి చెబుతున్నాను
ఇంతటితో చాలిక
॥చిక్కనైన సంసారం॥

బక్క-చిక్క-నట్టి వానికి
లెక్క-లేని సంతతి ఏల?
లెక్క-కు మించని జీతాలు
చాలవంటు గోల ఏల?
కన్ను మిన్ను కానక పూరక
కనేసి పారేశావంటే
వెన్ను విరిగి నడుములుజారి
చతికిల బడిపోతావు

।చిక్క-నైన సంసారం॥

ఏటేటా కానుపు లుంటే
గుల్లై పోతుంది తల్లి
ఎడమెడముగ పిల్లల కంటే
ఎంత సుఖమొ చూడు మళ్లీ
పాలు తాగు పసిపాపలు
పాలు విడచు వరకు భార్య
మొగము చూడబోడు పాత
రాతి యుగపుమోటువాడు
ఎడమెడముగ పుట్టిపెరుగు
బిడ్డలు బలవంతులని
కొండజాతివాడూ కూడా
నిండుగ విశ్వాసముంచు
ఋతుధర్మము పాటించును
చతుష్పాదులూ పక్షులూ
అన్నీ తెలిసిన నీకు
ఎందులకీ అజ్ఞానం

।చిక్క-నైన సంసారం॥

పంది కనును పదిపిల్లలు
ఒక్క యీతలోన
పదే పదే పదేసికనును
స్వల్ప వ్యవధిలోన
అర కడుపులతో మాడిన
ఆరు కాళ్ల పశువుల కన్న
సవ్యముగా పెరిగిన బలిసిన
కోడెలు రెండుంటే మిన్న
॥చిక్కనైన సంసారం॥

ముందు సాగుబండి వెనుక
వేలాడే వారినుండి
అభివృద్ధి నిరోధకులౌ
స్వార్థపరుల బారినుండి
తప్పించుకు సంప్రదించు
సమీపంపు కేంద్రములో
మెదడు కెక్కలేద నేను
చెప్పుచుంటి నాంధ్రములో
॥చిక్కనైన సంసారం
చక్కటి మణిహారం
ఎక్కువైన పిల్లల భారం
చిల్లముళ్ల హారం
పల్లేరుముళ్ల హారం॥

# ఏమి సేతునోయమ్మా

అలుక బూనెనే కృష్ణుడు అలుకబూనెనే
ఏమి సేతునోయమ్మా ఏమిసేతునే ॥అలుక॥

నిన్న రాత్రి యమునాతటి
వానిగూడి విహరించితి
పతి కోపముసేయు భయము
చేత విడిచి పోయితినని ॥అలుక॥

పాలు పెరుగు కడుపునిండ
ప్రేమ మీర త్రాగించితి
అధరామృత పానముచే
తనివి తీరగాలేదని
అహా- కాదు కాదు-
అధరామృత పానములో
ఆలస్యం బాయెనని ॥అలుక॥

పతి రూపము లోన వాడు
చెంత జేరి సరసమాడ
ఎప్పటివలె నేనాతని
కౌగిటిలో వివశనైతి
ఇంతలోన మగడు రాగ
కథ అక్కడె ఆగెనని ॥అలుక॥

ఇంత కన్న మించి ఎవతె
వెన్న పూయునే వానికి ॥అలుక॥

# వయ్యారి భామా

వయ్యారి భామా
నువ్వొక్కసారి సయ్యనవే ॥వయ్యారి॥

ముసుగు లోన నీ సొగసు
మబ్బేసినట్లుంది
మబ్బులో నీ మోము
మసిబూసి నట్లుంది
సిగ్గేలనే సేకు
నెల చందమామ
తెర దీసినావంటే
తొలగు మొయిలు భామ ॥వయ్యారి॥

మంగళ, బుధ, గురువారము
శుక్రవారమూ దాటి
శనివారము ఎటులో గడచి
ఆదివార మెళ్లినాక
సుష్కించిన చేను పైన
చినుకులు వెదజల్లినట్లు
సుఖము చేతబట్టుకుని
మళ్లి వచ్చె సోమ ॥వయ్యారి॥

నీ మనసూ నా మనసూ
కలసి వూసులాడుకుని
ఇద్దరము చేయి కలిపి
ఇంద్ర ధనసు పైకెక్కి
మనసు లోని కోరికలు
పెదవి పైన మొలకలెత్త
తనువు మరచి తనివి తీర
ఊయలూగు దామా ॥వయ్యారి॥

కడవతో కడవెడు
సారాయి తాగంగ
గంగనీటిని వోలె
పమ్ము కావంగ
చెలియ నీ కన్నులను
చూడ కైపెక్కింది
కల్లు కావే నీవి
కల్లు ముంతలు గాని ॥వయ్యారి॥

నేరిమే మెరుగనే
నెరజాణ నేను నీ
కరజాలమున నన్ను
చెరబెట్ట నెంచితే
ఘోరమైన నేరాలు
చేసినట్లే నేను
ఆజన్మ ఖైదైన
ఆనంద మౌనే ॥వయ్యారి॥

ఇంచు విల్లు వాని
గురి యౌట మంచిది
మంచి మల్లు నంచు
గర్వించుట కన్న
ఎంచ నేలైన మంచిది
చెలి పంచ యందున్న
మంచమందొంటరిగ
నిదురించుట కన్న ॥వయ్యారి॥

చంచలపు నీ కనులు
చూడ మత్తెక్కింది
చూపు నిలపావంటే
చిత్తు కాకేముంది
కసరి తిట్టినతోనె
కడుపు నిండినదామె
ఒకసారి సరియన్న
చౌమటెక్క కేముంది ॥వయ్యారి॥

ఎక్కడో దూరాన
నిలచి జ్ఞప్తికి రాగ
ఎద ఎంతో వేడుకతో
ఎగిరి గంతేసింది
ఎటకారమునకైనా
ఎదుట నిలచావంటే
ఎండిపోయిన ఎదను
వరద రాకేముంది ॥వయ్యారి॥

కల లోన కన్పడ్డ
కాంత చక్కటి మోము
కనుల బడ్డాదంటే
పిడుగు పడ్డాదనుకో
ఇంకెందుకే నన్ను
వేపుకుని తింటావు
మనవి విన్నావంటే
మనసు మళ్ళును నీకే ॥వయ్యారి॥

ప్రాణాలు విసిగినే
బావిలో పడబోవ
నీ మీది తీపి నను
పంచట్టుకుని లాగ
నరకాని కేగినా
నువ్వు తోడుంటేను
నరకమే నాకమా
నమ్ము నీ తోడు ॥వయ్యారి॥

జీవితము వద్దంటూ
జీవించుచున్నాను
జీవితము విషమాయె
తాగుతునే వున్నాను
బతికేటి ఆశతో
సుఖము పణముగ నొడ్డి
చావు కంటే ముందు
చావ పలసొచ్చింది ॥వయ్యారి॥

సాగరము పొంగినా
ఆకసము వంగినా
భూమి కంపించినా
పిడుగు పైన బడినా
పంచ భూతములన్ని
కలిసి దండెత్తినా
నీ కొంగు నీడ నా
బతుకు భద్రమ్మే ॥వయ్యారి॥

# వలచిన కోమలి

కోమలి నిను వలచినదని
పిలచి తెలుప వలెనా

వాలుగనుల వీక్షించి
మోము వాల్చి పైట రాల్చి
సంగనాచి వలె నిలచిన

కోమలి నిను వలచినదని
పిలచి తెలుప వలెనా

చెలియలు తన చెంత జేరి
తరచి తరచి వూసడిగిన
నీపేరును పెదవులపై
తేడానికి సిగ్గుపడిన

కోమలి నిను వలచినదని
పిలచి తెలుప వలెనా

ముదురుచున్న సంధ్యవేళ
అదురుపాటున ఎదురుపడియు
కసరుకుంటు వాలు జడను
విసరుకుంటు పోయెనంట

కోమలి నిను వలచినదని
పిలచి తెలుపవలెనా

# ప్రేమ భిక్ష

మోమొకింత చూపరాదె
మాటలాడ నేరమైన
జ్ఞప్తిగొనగ యతినింపవె
స్మరణ పుటల దిరుగవేసి ॥మోమొకింత॥

నీకై తొలి జన్మలలో
ఘోర తపము లాచరించి
చివరకు నిను చేరుకొనిన ॥మోమొకింత॥

కామదేవు కళలు చూచి
భీతి నొంది దిగులు పడితి
భామా నీ కను తలుపుల
చాటుననే దాగుకొనగ ॥మోమొకింత॥

స్నాన సంధ్యలు లేవు
మతి కుదురు లేదు నీ
రూప ధ్యానము వినా
అన్యమే సున్న ॥మోమొకింత॥

చంద్ర బింబపు మోము
గాఢ చుంబన చేయ
వేచితి సంధ్యనై విధుల మరచి
రాత్రి నౌదును రోషినీ కాంతరావె
భాష లేదిక నిను వేడుకొనగ నాకు
మోమొకింత చూపరాదె
మాటలాడ నేరమైన

# సతికుదరలేదు

మతికుదురు లేనినాకు
గతికుదర లేదు
మతికుదురు లేని నాకు
ఎంతగా యతినించినగాని
గతికుదర లేదు ॥మతికుదురు॥
జీవితానగల వెతలనుచేరిచి
కూర్చితి నేనొక కవితగా
ఎంతగా యతిసించినగాని యతికుదర లేదు
మతికుదురు లేనినాకు
యతికుదర లేదు ॥మతికుదురు॥

జీవన రాగము పాడగనెంచి
గుంజ బిగించితి జీవనాడుల
తెంచితి తంత్రుల నన్నిటివరుసగా
ఎంతగా యతినించినగాని శృతికుదర లేదు
మతికుదురు లేనినాకు
శృతి కుదర లేదు ॥మతికుదురు॥

యౌవన భారము పైబడి వేధింప
వెర్రిగ తిరిగితి వాడవాడల
ఎంతగా యతినించినగాని సతికుదర లేదు
మతికుదురు లేనినాకు
సతికుదర లేదు ॥మతికుదురు॥

# సంబర పడకు

ఎవరిని నవ్వించడానికి ఈపలుకులు
ఎవరిని కవ్వించడానికి ఈ కులుకులు
ముందరున్న పండుగ కానక సంబరపడి భ్రమిసేవు

విరిసి విరియని మొగ్గవు నీవు
ఎదుగుచున్న బుగ్గవు నీవు
విరిసి విరియని మొగ్గవు నీవు
ఎండ తాకుడు గాలి సోకుడు
చేతి రాపుడు చేతవాడును
యావనం-విరిసి విరియని మొగ్గవు నీవు

ఎదుగుచున్న బుగ్గవు నీవు
ఎదిగి ఎదను బరువెక్కించును
ఓపలేకను బద్దలౌను జీవనం-ఎదుగుచున్న బుగ్గవు నీవు

దేవుడిచ్చును అందచందాలు కాని
వాటి వెంటనె కులుకు తానెగా వచ్చు
చందమామ అందము చూడ మూడునాళ్ల ముచ్చటలే
యావనపు పువ్వులు కూడ మూడె ఘడియ లుండునులే
||ఎవరిని నవ్వించడానికి||

ముంచుకొచ్చు యావనాన్ని చూచుకు యిటు మురిసేవు
పైనబడే వయస్సు భారము ఏమాత్రము కాదనలేవు
ముదిమి ఘట్టమైన మీదట ముగిసే కథ వినలేవు

||ఎవరిని నవ్వించడానికి||

# నా చెంతనే వుండిపో

నా జంట విడచి మనకు
　　నీ వొంటరిగా చనకు
నా ప్రియతమ నీవు వినా
　　నా వారిక యిలనెవరు　　నా జంట విడచి

నీ రెండకు నా మనసెండి
　　పొడి వానలో తడవాలా
నీ నీడను నే మరవాలా
　　నా వాడవె నీవిటు లేల　　నా జంట విడచి

పెను చీకటిలో నను ముంచి
　　వెనుచూపుతు పోవుట పరువా
నను బ్రోవగ నీమది దలచి
　　చంద్రునివలె నీవిటు రావా　　నా జంటవిడచి

నా వారలు పరులుగ మారి
　　జగమెల్లను పగతో పోరె
పరదేశపు జీవితమెటులో
　　నా వారులేని జాగాలో　　నా జంట విడచి

రాగోదయ భాషలలో
　　మన హృదయపు ఘోషలలో
రతిపతి చాపపు వాడి
　　పసిపాపలపై దాడి　　నా జంట విడచి

# రాత్రింత మేలుకొని రాకచూచానే

బావ వస్తాడని బయట నిలుచుని నేను
రాత్రంత మేలుకొని రాకచూచానే
బావ వచ్చేదారి కనులుపరచుంచానే
బావరాకపోగా నిదురకూడా రాదే
కళ్ళుమూసే వేళ తొలికోడి కూసింది
భళ్ళుమని యింతలో తెల్లవారింది     బావవస్తాడని

సింగారమింతైన చెదరనేలేదే
తలలోని పూవులు వాడనేలేదే
కన్నీటి వేడిమికి కాటుకంతాకరిగి
చనుకట్టుపైబడె నల్లన్నిహారమై     బావవస్తాడని

ఎండిపోయినమోడుగా మారెనాబతుకు
చిగురించుననుఆశ చివరంట అడుగంటె
ఎంతదేబెనుగాక వేసారినాక
రాలిపోయిన ఆకులతికించుకున్నాను     బావవస్తాడని

తొలిరోజు రాత్రంత మేలుకొని గడిపాను
చందమామను అడుగు తారకల నడుగు
నాతోకలసి మండు చిన్నిదీపిక నడుగు
ఆఖరికి నావేడి కన్నీళ్ల నడుగు
ఆఖరికి నావేడి నిట్టూర్పు నడుగు     బావవస్తాడని

# కొత్తజంట

ఇకనైనా రారా మామా యింటికి పోదాముర
యింటికి పోదాముర
॥ఇకనైనా॥

కొమ్మమీద నొక కోతులజంట
పేలు చూసుకుని కులుకుతువుంటే
ఒంటరి నాకు ఒళ్లు ఝల్లుమని
నిన్ను కలియగా మనసయ్యింది
॥ఇకనైనా॥

నీకోసమునే సింగారించుకుని
సల్లి పట్టుకుని నడి సొస్తుంటే
దారిని వున్న అరకలు అన్నీ
అరుపులు చాచుకు అట్టేనిలచినయ్
॥ఇకనైనా॥

చెరువుగట్టుపై బడి వస్తుంటే
చివరి కొమ్మపై సిగ్గిడి సేసి
సరసాలాడే పిట్టల జంట
ఒంటరిగా నను చూసినవ్వినది
నిన్ను కలియగా మనసయ్యింది
పగలే రేయనిపించెను మామా

ఇకనైనా రారా మామా యింటికిపోదాముర

# ఎవరు విన్నారెవరు కన్నారు

ఎవరు విన్నారు ఎవరు కన్నారు
ఎవరు కన్నారు

పలుకరించు పైరులలో
తొలకరి తొలి జలకములో
చిలుక కన్నె పలుకులలో
కోయిలమ్మ గానములో
దిమ్మరించు కమ్మదనం కన్నారా ॥ఎవరు కన్నారు॥

వలచిన చెలి అలుకలలో
పిలచిన చెలి పలుకులలో
తొలి రాగపు కులుకులలో
చెలికన్నుల కొలకులలో
చెలగాడే చెలిమి బలం కన్నారా ॥ఎవరు కన్నారు॥

కన్నెకొంగు తాకుడులో
క్రీగన్నుల చూపులలో
చెలిగాజుల గలగలలో
బిగికౌగిటి బిగములో
తొంగిచూచు ఆనందం కన్నారా ॥ఎవరు కన్నారు॥

# నాకేమి ఒలిగనే ఈ ఋతువులోన

ఏపూలు పూచినా
ఏ ఆకు తొడిగినా
నా కేమి ఒలిగనే
యీ ఋతువులోన
॥ఏపూలు పూచిన॥

తుచ్ఛపురుగులు కూడ
మధువు గ్రోలేవేళ
కన్నీళ్లు మింగుతూ
గడుపవలసొచ్చెనే
॥ఏపూలు పూచిన॥

చివరి కొమ్మను చేరి
చిలిపిగా కూసింది
కొంటె కోయిల నన్ను
ఒంటరిగ చూచి
॥ఏపూలు పూచిన॥

రాలిపోయిన రవ్వ
లేరగాచూచితిని
రతనాల నాబతుకు
రాళ్లపాలుగ చేసి
॥ఏపూలు పూచిన ఏ ఆకు తొడిగినా
నా కేమి ఒలిగనే ఈ ఋతువులోన॥

# నీకు కూడా ఎదురు తగిలి నాడా! ఏమో?

చూడవే చెలియా
మాటాడవేమె సఖియా
ఎక్కడైన నీకు కూడా
ఎదురుతగిలినాడ ఏమొ?
మాటాడవేమె-మాటాడవేమె సఖియా
॥చూడవే చెలియా॥

నల్లని బాలుండు
అల్లరి గోపాలుండు
చూపుకింత లేడు కాని
చేత లెంతో కొంటెవమ్మా
చనువిచ్చి నావంటే
చక్కగ పోనీయడమ్మా
॥చూడవే చెలియా॥

కడవ చంక బెట్టుకోని
కాళిందికి పోతుంటే
నడుముచుట్టు చేయి చుట్టి
నడువు-పద-అన్నాడే
చక్కలిగింతౌతుంటే
ఒళ్లు పులకరిస్తుందే
॥చూడవే చెలియా॥

సుదతులంతా గూడి
చల్దులు కొనిపోతుంటే
ఒళ్లంతా కళ్లుచేసి
వంపులు చూస్తాడమ్మా
ఆ చూపుల మెత్తని తూపులు
స్వేదము రోమాంచము గొలిపె

॥చూడవే చెలియా॥

జలకమాడి కన్నెలంతా
తలలు ఆర బెట్టుతు వుంటే
చెట్టుచాటు పొంచియుండి
గుటకలు మింగాడమ్మా
పువ్వొక్కటి సూటిగ విసరి
పక్కున నవ్వాడమ్మా

॥చూడవే చెలియా॥

విడిగా నను చూచాడు
జడ పట్టుకు లాగాడు
సుడి తిరిగి నేనాతని
ఒడిలో పడినానమ్మా
కొంటెవాని చేష్టలన్నీ
చెప్పను సిగ్గానమ్మా
కొంటెవాని చేష్టలన్నీ
చెప్పను-సిగ్గానమ్మా

॥చూడవే చెలియా॥

నీలాటి రేవులోను
నీళ్లునింపుకుని నేను
కడవనెత్తి కెత్తమంటే
లంచమేమి టన్నాడే
ఏమిటా చొరవంటే
నువ్విచ్చిన దన్నాడే

॥చూడవే చెలియా॥

నేరపోయి వానివేపు
వోరచూపు చూచానే
అదునని నా చెంత జేరి
ఎప్పుడెక్కడన్నాడే
అటూ ఇటూ పారజూచి
ఎవ్వరు లేరన్నాడే

॥చూడవే చెలియా॥

పతి నిద్దురపోగానే
వీలుగ వస్తానంటే
కిటికీలో తొంగిచూచి
సైగచేసి పిలిచాడమ్మా
తొందరేమిటంటే
అది అంతేలే నన్నాడే

॥చూడవే చెలియా॥

# నిను విడనాడి - నేమనజాల

నిను విడనాడి నేమనజాల ॥నిను విడనాడి॥
నీవులేని నాబతుకు
అమవాసయేగా
నీచక్కటి రూపం
నాకంటి దీపం
దివినుండి దిగిరా
నాభాగ్యతారా
॥నిను విడనాడి నేమనజాల॥

ప్రాణముండు నాలో
ఇంకెన్ని దినాలో
ఏలను కలిమి
నీచెలిమిలేమి
వెలిగించునాలో
ఆశాజ్యోతి
జీవింతు నింక
ఎన్నో దినాలు
జీవింతు నింక
వేయి యుగాలు
॥నిను విడనాడి నేమనజాల॥

# ఎందున్నావురా - గోపాలా

నీ ధ్యానమందున
పసితనము గడచెరా
యౌవనము వచ్చి చేరినది
నీవూ నను చేర రారా
వెదకి వెదకినే వేసారితి రా
ఎందున్నావురా గోపాలా
॥ఎందున్నావురా గోపాలా॥

చంగు చంగుమని
లేగలు గంతున
ఘులు ఘల్లు మను
మువ్వల సవ్వడి
వినినతోడనే
నీవే అనిపించె-ఏలరా బిగువు
॥వెదకి వెదకినే వేసారితి రా
ఎందున్నావురా గోపాలా॥

అలిగితి వీవు
పలుకుట మాని
ఎవ్వరు పిలచిన
నీవే అనిపించె-ఏలరా బిగువు
॥వెదకి వెదకినే వేసారితి రా
ఎందున్నావురా గోపాలా॥

యమునా తీరము
సాయం సమయము
కళ్లు మూసినది
చెల్లియ ఒక్కతె
కోమలి కరములు
తాకినంతనే
కోమల కరములు
నీవే అనిపించె-ఏలరా బిగువు
॥వెదకి వెదకినే వేసారితిరా
ఎందున్నావురా గోపాలా॥

నీకై ద్వారము
కడ వేచితిరా
విసిగి వేసరి
నడుము వాల్చితిరా
దీపమునార్పెను
పురుగు యింతలో
తుళ్లి పడితిరా
నువ్వే అనుకుని-ఏలరా బిగువు
॥వెదకి వెదకినే వేసారితిరా
ఎందున్నావురా గోపాలా॥

# ప్రేమపూజ

మమతుంచి నను పిలువరా
నా రాజా
మనసిచ్చి నను గెలువరా
మమతుంచి నను పిలువరా

మనసున ఏమేమి
కోరికలున్న
నేనెటు లెరుగుదు
తెలుపక యున్న
మెల్లగ తెలపీయరా నా రాజా
మనసిచ్చి నను గెలువరా
మమతుంచి నను పిలువర

సముఖములో నేల -
యింత వియోగము
ఎవ్వరు కానని
గాథ నిశీథము
గడచిన మరి రాదుశా - నా రాజా
అదును పోనీకురా
మమతుంచి నను పిలువరా

ఎరుగను నాస్వామి
పూజ విధానము
కొంచెము తెలుపరా
ప్రేమ పూజారి
భారము నీదేనురా-నా రాజా
పూజ సేయింపగా
మమతుంచి నను పిలువరా

చదువుదు నే ప్రేమ
మంత్రము సాంతము
నువ్వేమి చెయ్యకు
"మమ" అను కోవే
ఆఖరువున తెల్పవే మన ప్రేమ
పూజ ఎటులుండెనో
మమతుంచి నను పిలువరా

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

# కలలోకి రావోయి

కలలోకి రావోయి-సఖానా
కలలోకి రావోయి

మనసులోని మాటేదో
చెవిలోన ఒక్క-సారి
వూదేసి పోరాదా-సఖానా
కలలోకి రావోయి

నీరాకను చూచినే
నిద్దుర నటియించి నాను
దొంగ నిదురలో కూడ
కలలు కంటు వున్నాను
కలలు నిజము చేయరారా-సఖానా
కలలోకి రావోయి

మధ్యలోన ఎవ్వరైన
తటాలున అరుదెంచిన
కనుతలుపుల చాటున నిను
దాచివుంచు తానోయి
అటూ, యిటూ చూచిరారా-సఖానా
కలలోకి రావోయి

# అద్దమందలి అందమెవరిది?

అద్దములో నిలచియున్న
ఆమె దందమా?
ఆమెఎదుట నిలచియున్న
నాదె అందమా?

టమాటాలు చూడ
ఎంతో ముద్దుగున్నవి
నాబుగ్గలు వాటికన్న
ఎఱ్ఱగున్నవి

॥అద్దములో నిలచియున్న॥

కొలనులోన కమలమ్మ
కులుకుతున్నది
నాకళ్లు చూచి
సిగ్గుచేత ముడుచుకున్నది

॥అద్దములో నిలచియున్న॥

తోటలోన తుమ్మెదమ్మ
ఝుమ్మని ఎగిరింది
నాముంగురులల్లే తన
రెక్కలను వంచుకుంది

॥అద్దములో నిలచియున్న॥

అర విరిసిన గులాబీలు
అందమైన వల్లవిగో
నా పెదవుల రంగు
వాటికెటులబ్బెనో తెలియకుంది

అద్దములో నిలచియున్న
ఆమెదందమా?
ఆమె ఎదుట నిలచియున్న
నాదె అందమా?

# కన్నీరు రానీయకు

నా కోసమై నీవు
కన్నీరు రానీకు
మనసు బాధ పడనీకు
నను మరచి పొమ్మా
నను తలుపగా పాపం
నను మరచి పొమ్మా
||నా కోసమైనీవు||

చాల బాగ ఆడేవు
ప్రేమ బొమ్మలాట
ప్రాణప్రియంబైన ప్రతిమ
పగుల గొట్టినావు
ప్రేమికులు నేర్వాలి నినుచూచి పాఠం
నను తలుపగా పాపం నను మరచిపొమ్మా
||నాకోసమై నీవు||

జీవ యాత్రలో తోడు
నీడ నీవెయంటూ
ఎంతో ఆశపడి నేను
ఎన్నో కలలు కంటి
మును కన్న కలలన్నీ మటుమాయమాయె
నను తలుపగా పాపం-నను మరచిపొమ్మా
||నా కోసమై నీవు||

నీవేమి సేతువు
విధివై పరీత్యం
ఎచ్చోటనైనా
మనుము సుఖాన
కలసేము పైజన్మనీజన్మకింతే
నను తలుపగా పాపం నను మరచిపొమ్మా
||నా కోసమై నీవు||

నా జీవ యాత్రకు
గమ్యము మారె
నీకనులు నాకనులు
తారసిల్ల వింక
నాకంటి చూపులు నిను తాకరాదు
నను తలుపగా పాపం నను మరచిపొమ్మా
||నా కోసమై నీవు||

గుండె బీటలోనుండి
వెడలు బరువు మాట
తగను తగను నీ
నీడనైన తాకగా
నాతలపు నీమదిని రానీయరాదు
నను తలుపగా పాపం నను మరచిపొమ్మా
||నా కోసమై నీవు||

బతుకు తామరాకు పైన
నీటిబిందువేగా
ఎపుడు జారిపోవునో
ఎవ్వారికెరుక
బతుకు చిన్న నీటిబుడగ మసలు నీటిలోన
నను తలుపగా పాపం నను మరచి పొమ్మా
||నా కోసమై నీవు||

రగిలెనా గుండెలో
బడబాగ్ని జ్వాల
నిట్టూర్పుగాడ్పులు
నినుతాకరాదు
దయ దలచినా కంటి
నీరు తుడువబోకు
కన్నీటి వేడిమికి కొంగు మాడిపోదా
నను తలుపగా పాపం నను మరచిపొమ్మా
||నా కోసమై నీవు కన్నీరు రానీకు
మనసు బాధ పడనీకు నను మరచి పొమ్మా||

# వేళా పాళా లేదా?

చేరరావె నాప్రియా—మారుపల్కవే
నినుచేరగ మునుపుకన్న
కలలు నేడు నిజమాయెను ||మారుపల్కవే||

ఎరుగుదు మగవారి వరుస
ఎవరికెరుక లేదులే
చాలును యీ సరసమింక
వేళపాళా—లేదా ||ఎరుగుదు మగవారి వరుస||

మగువలకని మగవారలు
వగలు ఒలక బోతురని
ప్రేమాతురమే కాని
లజ్జభీతి ఎరుగరని
ప్రేమాతురమే కాని
పగలు రేయి ఎరుగరని ||ఎరుగుదు మగవారివరుస||

మోయలేను తనుభారము
ఎటులతీరు తనుదాహము
సరసమింక చాలులేవె
చేరరావె నాప్రియా ||మారుపల్కవే||

పూలబాణములు తాకిపులకరించెనామేను
బాసలతో పనిఏమిచేరిమురియువేళ
చేరరారా! చేరరావే!

# లోకానికేమెరుక

లోకానికే మెరుక
నావిషాద గాథ
బరువౌ బాధ

॥లోకానికేమెరుక॥

నదివేపు నేను
పరుగులిడుట కని
లోకము అనుకొనె
ఆత్మ హత్యకని
మదిలో రగిలే
మంటల నార్పగ
కడ వెడు కన్నీళ్లు
సరిపో లేదని

॥లోకానికేమెరుక॥

నీడలోన నే
నొకపరి నిదురింప
ఎల్లరు పడ్చిరి
ఏమి భాగ్యమని
వాస్తవ రూపము
వారల కేమెరుక
విషపూరితమౌ
పడగనీడ యని

॥లోకానికేమెరుక॥

వనమున అడుగిడు
ననుకని లోకము
వింతగ తలపోసె
విహారార్థమని
చినిగిన హృదయము
జోడించు కొనగ
ముళ్లను ఏరుటకై
వెళ్లితినని ||లోకానికేమెరుక||

గుడికేగే నను
చూచి తలపోసె
తప్పులు మన్నింప
వేడుకొందునని
కష్టాలంటే
ఎంతకష్టమో
తెలుసు కొనుటలో
తెలివి యున్నదని
విధినే ఒకపరి
హెచ్చరింతునని ||లోకానికేమెరుక||

# అందని స్త్రీ వలపు పులుపు

అందని స్త్రీవలపు పులుపు
అందినచో హాయిగొలుపు ||అందని స్త్రీ||

అందమైన చిన్నది నీకందినచో గెలుపు
అలిగి చేయి చేసుకొనిన కందు మోము నలుపు
||అందని స్త్రీ||

తెరనుండి తొంగిచూచు కన్నెమనసు నలుపు
తెరతీసిన నీమనసు పసపమిటో తెలుపు
||అందని స్త్రీ||

మలుపులెన్నో తిరిగి కడకు చేరితి నీతలుపు
పలుపులతో బంధించిన నిలుపదు నీపై తలపు
||అందని స్త్రీ||

కన్ను కన్ను కలుసుకున్న
అదియె నీకు పిలుపు
దరి చేరియు బిగిసి యున్న
అదే గుండె సలుపు
దరి చేరియు బిగిసి యున్న
అదే పుండు సలుపు

అందని స్త్రీవలపు పులుపు
అందినచో హాయి గొలుపు

# విషాదగాథ

ఎన్ని యుగముల నుండియో ఏడ్చుచుంటి
నవ్వుటయె ఎరుగని నన్ను ఎరుగు
చచ్చి యుంటిని ఇప్పటికే సగముపైన
సార్థకంబేమి జీవించి ఇంకపైన

ఏమి తెల్పుదు నా విషాద
గాథవినగా బాధయా
నీవులేనిది నాకమైనా
నాకునరకము కాదటే ||ఏమి తెల్పుదు||

గుండెలో మండేటి మంటలు
ఎంత మండునో మండనీ
పొగలు మాత్రము ఎంతమాత్రము
పెదవిపై రానీయను ||ఏమి తెల్పుదు||

నవ్వలేని నన్ను చూచి
లోకమెంతగా నవ్వెనో
నవ్వినవి కన్నీళ్లు కూడా
నవ్వినవి నిట్టూర్పులూ

ఏమి తెల్పుదు నావిషాద
గాథవినగా బాధయా
నీవులేనిది నాకమైనా
నాకు నరకము కాదటే

# ఎందు పోతున్నావే

ఎందుపోతున్నావే అందాలబాల
నీలాటిరేవుకు నీళ్లు తేడానికా
కన్నయ్య కాడికి పొన్న చెట్టునీడకా ॥ఎందు పోతున్నావె॥

మమ్ము మరపించావు
మందవీడి పోయావు
మాచెవిని ఊదిన
వారించు వారమా ॥ఎందుపోతున్నావె॥

చల్లలమ్మ బోదునని
కల్లలాడు తున్నావె
సంధ్యవేళ యమునాకాడ
ఎవడు కోనునె నీచల్ల ॥ఎందుపోతున్నావె॥

కలనైనా వాని పేరు
కలవరించు చున్నావె
మగని పక్కనుండి కూడ
వాని ధ్యాన మేన నీకు ॥ఎందుపోతున్నావె॥

తనువు ఒక్కరి దీను
మనసు యింకొకరిదా
ఒక్క ఒరను కత్తులు రెండు
ఎటులిమడ్చ దలచావె ॥ఎందుపోతున్నావె॥

# భామా - మూతిముడిచి లాభంలేదు

భామా! ఏమిలాభము ఈవిధాన
మూతిముడుచుటలో ॥భామా॥

తనకు తానై
ప్రియుడు పిలువ
బిగువును చూపిన
వగలాడి
మారుని శరముల
వేడిమి మీరగ
ముక్కునేలనిడి
వెంబడించుటలో
ఏమి లాభము ఈ విధాన
మూతి ముడుచుటలో ॥భామా॥

యుక్త వయసులో
యువకుని చూపిన
పెళ్లియె వలదని
పెడ మొగమిడితివి
యాపన భారము
మెడలు విరుపగ
అమ్మను చేరి
ఒడలు విరుచుటలో
ఏమిలాభము ఈవిధాన
మూతిముడుచుటలో ॥భామా॥

## ఆశలన్నీ మాసిపోయె

ఆశలన్నీ మాసిపోయె
ఎండమావుల మాదిరి
దూరమాయెను తీరము
సుడిలోన మునిగితి నావతో ॥ఆశలన్నీ మాసిపోయె॥

మనసులోని మధురస్మృతులను
భ్రమసితిని నే మణులని
తరచిచూచిన తెలిసె తామర
ఆకుపై బిందువులని-కను
తెరచిచూచిన తెలిసె తామర
ఆకుపై బిందువులని ॥ఆశలన్నీ మాసిపోయె॥

కలలనెన్నో చేర్చి
నిర్మించితిని
ఆశాసౌధము
ఒక్కగాలికి నేలకూలెను
పేక ముక్కల మాదిరి

॥ఆశలన్నీ మాసిపోయె॥

మురిసితిని నే మెరుపులనుకని
భావిబాట వెలుగులని
కటిక చీకటి కడకు మిగిలె
కానరాదు ఏదరి

॥ఆశలన్నీ మాసిపోయె॥

భువిని కురిసిన భూరివర్షము
పెంచె సిరులను ఒకరికి
చిన్ని నా యీ గుడిసెను
పెకలించి వేసె పునాదితో

॥ఆశలన్నీ మాసిపోయె॥

## బత్తాయిపళ్లు వాడితే ఒంటికి మంచిది

పళ్లో-బత్తాయి పళ్లూ
పదారు వన్నె పళ్లూ బల్
పసందైన బత్తాయి పళ్లూ

ఒక్క-చూపు చూస్తివా
రెప్పపడగ ఒప్పుకోదు
గొప్ప గొప్ప ఓళ్లంతా
చప్పరించు బత్తాయి

॥పళ్లో బత్తాయి పళ్లూ॥

జబ్బునుండి కోలుకున్న వారికోరకుపళ్లు
పాలుతాగు పసిపాపలు పెరుగుటకై పళ్లు
కొత్త పిచ్చి కుర్రాళ్లు పొద్దెరగక కోరుపళ్లు
వయసుడిగిన ముసలాళ్లు అదేపనిగ వాడుపళ్లు

॥పళ్లా బత్తాయి పళ్లా॥

మత్తు పదార్థాల మీద మక్కువ చూపించువారు
చుట్ట, బీడి, సిగరెట్ కట్టలుగా కాల్చువారు
అప్పుచేసి కూడా సినిమాల వెంట తిరుగువారు
నాపళ్లు మరిగితే వాటిజోలికే పోబోరు
నాపళ్లు మరిగితే వాటివాసన దరిచేరనీరు

॥పళ్లో బత్తాయి పళ్లా॥

# మది పూరుకోదు

నీవు నా వేపు చూడకుంటే
పరవాలేదు
ఇంకొకరి కేసి చూసినావా
మది పూరుకోదు ||నీవు నా వేపు||

నాకు లేకుంటే
లేకపోనీ కానీ
ఇంకొకరు తింటూ వుంటే చూచి
"మమ" అనుకోలేను ||నీవు నా వేపు||

బ్రహ్మచారిగా
యుగాలు గడిపేస్తాను
జంటకట్టి కూడా
ఒంటరి తనము
క్షణమోపలేను ||నీవు నా వేపు||

దూరాన ఎంత కాలమైనా
వస్తుంటా కాని
విస్తరేసి తీరా మోసి
ఆషాఢమంటే
మది పూరుకోదు
నీవు నా వేపు చూడకుంటే పరవాలేదు
ఇంకొకరి కేసి చూసినావా మది పూరుకోదు

# ఈవని నీకొరకే

ఈవని నీకొరకే
వింత వింతగ రంగుల
పూవులు పూచే ||ఈవని నీకొరకే||

రవిజూచి అటుతిరిగె
నీసూర్య కాంతము
ననుజూచి అటుతిరిగె
నీచంద్ర బింబము
మనకలయికను కోరి
విరులన్ని ఒకమాటె
ఋతు ధర్మమును విడచి
పులకించి వికసించె ||ఈవని నీకొరకే||

నామది నీకొరకే
తియ్యతియ్యని కలలను
కనికని వేచె ||నామది నీకొరకే||

ఎనలేని మనప్రేమ పెనవేసుకున్నది
విడదీయగా వశమె విధిదేవుకైనా
మనినాములే మనసైనన్ని రోజులు
ఈరోజుకై యుగ
యుగములు వేచె ||నామది నీకొరకే||

# తెరతీయవె-రాధా

మేలిముసుగు తెరతీయవె రాధా
మోహన రూపము చూపగరాదా
॥మేలిముసుగు తెరతీయవెరాధా॥

అందము చిందేటి నీముఖబింబము
అందరు చూచిన కందిపోవునటే
ఎందరి కీవిధి చవిచూపెదవే
తీయగలేని తియ్యనిబాధ
॥మేలిముసుగు తెరతీయవె రాధా॥

తెరతీయు మని వేడితి కాని
తెరతీయ ముఖ కాంతినే నోపలేనే
నీకనుచూపుల తూపులు తాకిన
పాషము హృదయము గాయముకాదా
॥మేలిముసుగు తెరతీయవెరాధా॥

హృదయపు గాయము మాన్పగ జేసిన
వైద్యము మరిమరి పెంచునె బాధ
బాధవెనుక దాగిన మాధుర్యము
తెలిసినవారికె తెలియునుగాదా
మేలిముసుగు తెర తీయవెరాధా
మోహన రూపము చూపగరాదా

# జగము ఒక్క ధర్మశాల

జగము ఒక్క ధర్మశాల
చూడ చిత్రమౌను చాల
వచ్చేవారు వస్తూవుంటే
పోయేవారి కోసము గోల ॥జగముఒక్కధర్మశాల॥

ముసలి తనము వచ్చిందంటే
వెనుక తిరిగిపోదు
యౌవనము పోయిందంటే
మళ్లీ తిరిగి రాదు
దీపముండగానె యిల్లు
చక్కబెట్టవేలా ॥జగముఒక్కధర్మశాల॥

పేరుధర్మశాలే కాని
ధర్మానికి సాలకాదు
పెట్టి పుట్టి వుంటేకాని
చోటు పుట్ట దీచోట
నీవంతుకు అంతో యింతో
నడుము వంచవేలా ॥జగముఒక్క-ధర్మశాల॥

కాలుచేయి ఆడకపోతే
ఎవ్వడు పెడతాడు తిండి
జీర్ణకోశానికి కూడా
పనిచేయక గడువదుపొట్ట
దొంగతనం చేసేకంటే
చావుకోరవేలా ॥జగము ఒక్క-ధర్మశాల॥

ఇక్కడికి కొచ్చేవారంతా
ములతా_ఫైరా తేరు
పోయేనాడొక్కడు కూడా
పుల్లైనా కొనిపోలేడు
మధ్యవచ్చు మంగళహారతి
చూచిమురియుటేలా ॥జగము ఒక్క-ధర్మశాల॥

# పేరుమోసిన ప్రేమికుణ్ణి

పేరుమోసిన ప్రేమికుడనా
సాటి యిలలో కలరటే
దమ్ములుంటే రమ్మను
సవ్వాలెదుర్కొని పొమ్మను ॥పేరుమోసిన॥

నెత్తిమీద ఆకాశం
బరువంతా మోస్తున్నా
కంటినీట కడవముంచి
కడలి నింప చూస్తున్నా ॥పేరుమోసిన॥

నీ కోసము నే తిరిగిన
దారి తెలియడానికి నా
అరికాళ్ల చాళ్లనుండి
నెత్తురు కారుస్తున్నా ॥పేరుమోసిన॥

నీమీదే నాకు ప్రేమ
వుందా అని శంకిస్తే
గుండె కోసి ప్రతి బిందువు
చేత సాక్ష్యమిప్పిస్తా
గుండెకోసి ప్రతీ కణం
చేత నిజం చెప్పిస్తా ॥పేరుమోసిన॥

నా నిజాయితీని నువ్వు
అనుమానిస్తే చూడు
శిరంనరికి మొండెంతో
వాగ్దానం చేయిస్తా
అరచేతిలో శిరసువుంచి
అనుమానం తీరుస్తా ॥పేరు మోసిన॥

నా తెగవుని పరీక్షించ
చూస్తున్నావా యిదుగో
నరం చీల్చి కలంముంచి
రక్తంతో రాసిస్తా
వరం అడుగు అడుగుకొక్క
తాజ్ మహల్ కట్టిస్తా ॥పేరు మోసిన॥

ఇల్లూవాకిలి లేదని
ఎందుకు సంకోచిస్తావ్
గుండెగుహల నిన్నుంచి
ఉయ్యాలలు వూగిస్తా
చంద్రుణ్ణి తెంపితెచ్చి
దీపంలా వెలిగిస్తా ॥పేరు మోసిన॥

నీకోసం ఏ త్యాగం
చెయ్యమన్న చేసేస్తా
మజ్నూ ఫర్హాదులు
నాతరవాతే అనిపిస్తా
ఇటుపైనకూడ నాకుసాటి
పుట్టబోరననిపిస్తా ॥పేరు మోసిన॥

# విడిపగడాలు

ప్రాణం తీసుకు పోతున్నారా యమభటులారా ఆగండి
మూల వున్నదాక ఆశలమూట అదికూడా తేసివ్వండి

దేవతలారా స్వర్గానికి నన్నొక్కడినే రమ్మంటారా
ఆశవదలి నేనెలా రాను అది లేక ఏమిపని స్వర్గంలో

పగలె చీకటి కమ్మితే మరి రాత్రి యింకెటులుండునో
రాత్రి గడచేటట్లు లేదు బతుకెలా తెల్లారునో
నిన్న గడవని నాకు రేపు ఎక్కడిది

చెలి వియోగములోన చెడి బతుకు నాకిపుడు
అందులోనే సుఖము అధిక మనిపించె

కలుసు కుంటే సుఖము కాసేపుతో సరి
ఎడబాటులో ప్రేమ ఎంత తీపో మరి

ఇంత దుఃఖం ఎలా భరింయింతువో యని
పగవ నక్కర లేదు నను చూచి నవ్వ

వెయ్యి సారులు కొలిమి పెట్టి సమ్మెట కొట్టి
నిగ్గు తేలిన నాకు అది ఎంత లెద్దా

గడియారంలోన దూరి చక్రానికి భుజంమోపి
ఎంత తోసినా గడపదు కష్టాల పాడుగడియ
ఎంత నెట్టినా నడపదు విరహంలో ఒక్క గడియ

మంచిరోజులు మాంచి మర గుర్రము ల్లాగ
మైళ్లు దాటేస్తాయి మనకి తెలియకనే
మాయమై పోతాయి మనకళ్ల ముందే
మాయమైపోతాయి మనకళ్లు కప్పి

తెల్లవారుతుంది చీకటి పడుతుంది
యిదే విధంగా జీవితాంతమూ అవుతుంది
యిదే విధంగా జీవితాంతం అవుతుంది

అందరూ ప్రేమికులనందురు ఏమి భాగ్యము మీాదని
వారలేకద చావుకంటే ముందు చచ్చేవారలు.

## ఆశాకిరణం

అయినా నాముఖముమీద చిరునవ్వుంది
ఎడారిలో పయనించే
ఏకాకి పాంథుడను
ఎండ మావులను వెంబడి
దప్పి తీర్చుకోలేక
కొనప్రాణము చేబట్టుకు
దిక్కు వెదకు చున్నాను ॥అయినా నాముఖముమీద॥

తనవారలు పరులై
పలు వెతలకు గురిచేసినారు
కోరి తెచ్చుకున్న వారె
తలపై కొరివైనారు
ఆసలు అడియాసలుగా
అలమటించు చున్నాను ॥అయినా నాముఖముమీద॥

చెట్టు చివరి కొమ్మమీద
గూడు కట్టు కున్నాను
రెక్కలు తెగి ఎగురలేక
దిగులు చెంది యున్నాను
కర్మ కాలి వనమంతా
భగ్గున తగులబడిపోయె ॥అయినా నాముఖముమీద॥

ఎడ తెగని కష్టాలకు
యెదు రీద గాలేక
బదులు తెచ్చుకున్న ఓర్పు
చాలీ చాలక పోయె
కాలకూట విషమేనా
కష్టాలకు ఔషధమని
మృత్యు ముఖములోన
కంఠమంచి బతుకుతున్నాను ॥అయినా నాముఖముమీద॥

ఉరికంబము మీద నిలచి
ఊహాకంద కున్నాను
రేపేమో మేలౌనని
చావుకి వాయిదా కోరి
ఆశా కిరణము ఊతగ
చేత బూని నిలచియుంటి
అయినా నాముఖముమీద చిరునవ్వుంది.

# దేశసేవానికి పొదుపు అవసరం

ఎవరు గొప్పవారెవరు బీదవారు
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

ఆదాయంలో ఖర్చిమిడ్చుకుని
అంతో యింతో పొదుపుచేయువారే-గొప్పవారు
చెప్పండిమీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

నెలకు వందరూపాయిలు తెస్తూ
తొంభైలోనే ఖర్చిమిడ్చుకుని
పదిరూపాయిలు పొదుపుచేసుకుని
పదిలంగా ఒక చోటవేయువారే గొప్పవారు
చెప్పండిమీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

నెలకువెయ్యి రూపాయిలు జీతము
చెప్పసిగ్గు ఆఫీసరు గారికి
జీతం అందిన వారంలోనే
జల్సాగా అంతా ఆర్పేసి
చివరకు కుండలు ఢింకీకొడితే
అప్పులపైకె అల్లాడేవారే-అసలు బీదవారు
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

వచ్చే ఆదాయం సరిపోదని
పంకరదారులు తోక్కేకంటే
అదనపు ఖర్చులు తగ్గించేస్తే
అదియే అదనపు ఆదా కాదా — ఎవరు గొప్పవారు
చెప్పండిమీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

ఒంట్లో ఓపిక వున్నరోజున
అంతో యింతో తెస్తారు
తెచ్చినదంతా తెగమింగ స్తే
లేనినాడు ఏంచేస్తారు
రోగమొస్తె ఎటుపోతారు
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

వర్షాకాలం ముందరకుందని
ముందు జాగరత పడతాయి
రేయిపగలు అనకుండా చీమలు
ఓపికతో పనిచేస్తాయి
వర్షమొచ్చినా వరదలొచ్చినా
పరవాలేదని ధీమాగా
కాలుమీద కాలుంచి పొదుపు
చేసినధాన్యం తింటుంటాయి
జ్ఞానం కలిగిన మనుషులము
మనకింకా వేరేచెప్పాలా?
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

చిన్నతనంలో నాయనమ్మ
చేస్తుండిన పని నేచూశాను
ఆపూటకి కొలిచిన బియ్యంలో
పిడికెడు బయటికి తీసేది
మూలవున్న ఒక బానలోపల
ముష్టివేసినటు వేసేది
ఏమిటి నానమ్మా అని అంటే
హుండీ అంటూవుండేది
ఖర్చు చేయునపుడల్లా
కొంతైనా హుండీలో వేయండి
హుండీ అలవాటే మా అందరికి
బతుకులు గట్టెక్కించింది
నా చదువుకైన డబ్బెక్కడిది
హుండీలోదే
మా చెల్లి పెళ్లి డబ్బెక్కడిది
హుండీలోదే
ముసలితనంలో నాన్న హాయిగా
కూర్చుని తింటుండెక్కడిది
హుండీలోదే
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

యేడాదికి పది పుట్లు పండును
ఏమిలాభము వృధాఖర్చులు
మదుపులకోసం గుక్కతిరగక
మారకానికై అప్పులుచేసే
వాడు బీదవాడు
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

MEMORIAL LIBRARY V.R NARLA D.P.R.L. Acc. No.

A0UA104B102

రిక్షా నడిపే అప్పారావు
రోజుకయిదు రూపాయిలు తెస్తే
చదువులేకపోయినా గడసరి
ఆతని భార్య సింహాచలము
మూడు రూకలతో సరిపెట్టుకుని
రెండు వెనక వేస్తుండేది
పాపం అప్పారావుకు ఒంట్లో
ఆరోగ్యం సరిగా లేనప్పుడు
పొదుపుచేసిన డబ్బే వారల
గౌరవాన్ని కాపాడింది
అద్దె బండి వదిలేశాడు
స్వంత బండి కొనుకున్నాడు
అదృష్టవంతుడు అప్పారావు
ఆటోరిక్షా కొన్నాడు
చెప్పండి మీలో ॥ఎవరు గొప్పవారెవరు॥

పొదుపులోన యింతింతని
చెప్పగలేని మహాత్యం వుందండి
మనిషికొక్క రూపాయి పొదుపుతో
దేశానికి యాభైకోట్లు
ప్రజలుచేసిన పొదుపు మీదనే
దేశం శ్రేయస్సుంటుంది
చెప్పండి మీలో ॥ఎవరుగొప్పవారు॥

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA104B102 |
| పుస్తకం పేరు | పాలకడలి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | YES |
| వెనుక అట్ట | no |
| మొత్తం పేజీలు | 119 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CT, |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Jayalakshmi |
| పేజీలు విడదీసినది | Jayalakshmi |
| స్కాన్ చేసినది | Hasma |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |